# వాస్తవం డెయిలీ.కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

శనివారం 12.09.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)


## కొండా సురేఖకు మీనాక్షి ఫోన్

క్రియాశీలకంగా మారాలని సూచన

బర్తరఫ్ తరువాత అసెంబ్లీకి రాని సురేఖ

2లో..



# మొదటిసారి ఎమ్మెల్యేలతో ఆగమే?




- స్వంత పార్టీ క్యాడర్‌లోనే అసంతృప్తి
- ఆత్మీయ పలకరింపులే లేవంటూ మధనం
- గెలవక ముందు ఓ తీరు.. గెలిచినంక మరో తీరు

- విషయ పరిజ్ఞానం కన్నా నోటి దురుసే ఎక్కువ
- ఇలాంటివారిని నమ్మి మళ్లీ పార్టీ టికెట్లిస్తే గోదారి ఈదినట్లే
- ఒకరిద్దరు మినహా మిగతావారి పనితీరు అంతంతమాత్రమే
- గడిచిన ఎన్నికల్లో కారు గల్లంతుకు ఇదే కారణం
- ఇప్పుడు కాంగ్రెస్ పరిస్థితి కూడా అదేనా?
- సీఎం రేవంత్ అందుకే హెచ్చరికలు చేశారా?

గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది మొదటిసారిగా శాసనసభలో అడుగుపెట్టిన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను ఉద్దేశించి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం సీఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు వారి రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని స్పష్టం చేశారు. 'మీ ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుంది. మీ వ్యక్తిగత పనితీరే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుంది' అని హితవు పలికారు. ప్రజలు అప్పగించిన పదవిని సక్రమంగా వినియోగించుకోకపోతే రాజకీయ భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు.గడిచిన ఎన్నికల్లో గెలుపొంది వన్‌టైం వండర్‌లుగా మిగిలిపోరాదని పనితీరు మెరుగుపర్చుకుని దీర్ఘకాల ప్రజాప్రతినిధులుగా మిగిలిపోవాలని సీఎం రేవంత్ రెడ్డి చేసిన సూచన విలువైనదే.

## జీవో 97లో మార్పులు చేస్తాం : వివేక్



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 :** జీవో నంబర్ 97లో మార్పులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని కార్మికశాఖ మంత్రి జీ వివేక్ వెల్లడించారు. శాసనసభలో శుక్రవారం విద్యా సంస్కరణలపై జరిగిన చర్చ సందర్భంగా మంత్రి సమాధానమిచ్చారు. రూ.8 వేల కోట్లతో పాలిటెక్నిక్ విద్య ను ఆధునీకరించాలని ఆలోచిస్తున్నా మని చెప్పారు. పాలిటెక్నిక్ విద్య ప్రైవేటీకరణ అవుతుందన్న అపోహాలు న్నాయన్నారు. పాలిటెక్నిక్ విద్య ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని, ఏఐసీటీఈ సర్టిఫికెట్ విద్యార్థులకు కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఇంజినీరింగ్ లేటరల్ ఎంట్రీ కొనసాగుతుందని, కొత్త కోర్సులపై అధ్యాపకులకు శిక్షణ కల్పిస్తామని వివరించారు.

## కోర్సు పూర్తి చేస్తేనే డ్రైవింగ్ లైసెన్స్!

### క్యూర్ పరిధిలో త్వరలో కొత్త నిబంధనలు

**హైదరాబాద్ , సెప్టెంబరు 11 :** రాష్ట్రంలో డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో త్వరలో నూతన నిబంధనలు అమల్లోకి రానున్నాయి. రహదారి భద్రతపై రూపొందించిన రెండున్నర గంటల నిడివిగల వీడియోలను వీక్షించటంతోపాటు వాటిపై నిర్వహించే పరీక్షలో దరఖాస్తుదారుడు పాస్ కావటాన్ని తప్పనిసరి చేయనున్నారు. ఈ నిబంధనలతో కూకట్‌పల్లి ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో ప్రారంభించిన పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో త్వరలో రాష్ట్రమంతటా అమలుచేయాలని అధికారులు భావిస్తున్నారు... ఇందులో భాగంగా మొదట కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో అమలు చేయాలని నిర్ణయించారు. మరో 30- 45 రోజుల్లో ఈ విధానం క్యూర్ పరిధిలో అమలు చేస్తామని ఒక అధికారి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుంటున్న చాలామందికి ప్రస్తుతం రహదారి భద్రతా నిబంధనలపై సరైన అవగాహన ఉండడం లేదు. దీంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా, యూకే, అమెరికా వంటి దేశాల్లో ఉన్న ఉత్తమ విధానాలను పరిశీలించి నిబంధనలపై వీడియోలను రూపొందించారు. లెర్నర్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ (ఎల్ ఎల్ఆర్) చేసుకున్న అనంతరం ఈ వీడియోలను ఆన్‌లైన్‌లో వీక్షించి, పరీక్ష రాయటమే ఈ కోర్సు.

## బలహీన దేశాలకు జీ7 పేరెందుకు?

ప్రపంచ జీడీపీలో 40 శాతానికి పైగా వాటా బ్రిక్స్ దేశాలదే

జీ7 వాటా 29 శాతం మాత్రమే

బ్రిక్స్ వ్యాపార సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 :** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం గ్రూప్ ఆఫ్ సెవన్(జీ7)పై విమర్శలు గుప్పించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో జీ7 వాటా క్షీణించ డాన్ని, పెరుగుతున్న బ్రిక్స్ ఆర్థిక ప్రాబల్యాన్ని ఆయన సరిపోల్చారు. న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ వ్యాపార సదస్సును ఉద్దేశించి పుతిన్ ప్రసంగిస్తూ ప్రపంచ జీడీపీలో జీ7 దేశాల వాటా సుమారు 29 శాతం మాత్రమే ఉండగా బ్రిక్స్ సభ్య దేశాల వాటా దాదాపు 40 శాతం ఉందని అన్నారు. 2014లో క్రిమియాను విలీనం చేసుకున్న తర్వాత బహిష్కరణకు గురయ్యే వరకు రష్యా అప్పటి జీ8లో సభ్యదేశంగా ఉండేది. ఆ తర్వాత ఆ కూటమి తిరిగి జీ7గా మారింది. 20వ శతాబ్దం ద్వితీయార్థంలో ఆర్థిక వృద్ధికి నాయకత్వం వహించిన దేశాల స్థానాన్ని క్రమంగా కొత్త వృద్ధి కేంద్రాలు ఆక్రమిస్తుండటంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మారుతున్నదని పుతిన్ చెప్పారు.ప్రస్తుతం ప్రపంచం నిర్మాణాత్మకమైన, లోతైన, అత్యంత కీలకమైన మార్పులకు లోనవుతున్నదని ఆయన అన్నారు. బలమైన ఆర్థిక శక్తులు ఇప్పటికీ కీలకమైన మౌలిక సదుపాయాలను, సాంకేతికత, శాస్త్రీయ పరిశోధనల్లో ఆధిక్యాన్ని కలిగి ఉన్నాయని అంగీకరించారు. అయితే ప్రపంచ ఆర్థిక నాయకత్వంలో మార్పులు అనివార్యమని ఆయన తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు భారత్ అందిస్తున్న సహకారాన్ని పెరుగుతున్న సభ్య దేశాల ప్రభావానికి నిదర్శనంగా పేర్కొంటూ బ్రిక్స్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక కూటమిగా అభివర్ణించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మారుతున్న నేపథ్యంలో ఈ కూటమి తన పరిధికి వెలుపలి దేశాలకు కూడా ద్వారాలు తెరిచి ఉంచిందని ఆయన పేర్కొన్నారు. అలాగే సభ్య దేశాల మధ్య మరింత బలమైన సహకారం ఉండాలని పిలుపునిచ్చారు. జీ7 తనను తాను గొప్ప ఆర్థిక శక్తిగా ఎందుకు అభివర్ణించుకుంటున్నదో తనకు అర్థం కావడం లేదని కూడా పుతిన్ వ్యాఖ్యానించారు. పోటీదారులను బలహీనపరచడం ద్వారా పాశ్చాత్య దేశాలు తమ ఆర్థిక ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని పుతిన్ ఆరోపించారు. కొన్నిసార్లు పోటీ వికృత రూపాలను దాల్చుతుంది. రాజ్యం, ప్రభుత్వ స్థాయిలలో కూడా మనం దీనిని చూస్తుంటాం అని ఆయన చెప్పారు. పైప్‌లైన్ల ధ్వంసం, అంతర్జాతీయ రవాణా కారిడార్లను అడ్డుకునే ప్రయత్నాలు, నౌకల స్వాధీనం, చట్టవిరుద్ధమైన ఆంక్షల విధింపు వంటి చర్యలు ఇందులో ఉన్నాయని ఆయన అన్నారు. తమ స్వీయ ఆర్థిక (మిగతా 2లో...)

# కమీషన్లు నాకెందుకు?

దేవుడు నాకు అన్నీ ఇచ్చాడు.. ఇంకా కక్కుర్తి ఎందుకు!?

డబ్బులు కావాలనుకుంటే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వేల కోట్లు సంపాదించేవాడ్ని.. కక్కుర్తిపడే జాతకం కాదు నాది

జెన్‌జీ గురించి కాదు.. ఆల్ఫా, బీటాల గురించి ఆలోచిస్తున్నా

పేదలకు న్యాయం జరగాలనే విద్య, న్యాయ శాఖలు తీసుకున్నా

కేటీఆర్‌ను చూసి అసహ్యించుకునేవాళ్లే, అసూయ పడేవాళ్లు లేరు

ఫీజు రీయింబర్స్‌మెంట్ పాపం నాది కాదు.. కేసీఆర్ సర్కారుది

కాలేజీలపై దాడులు చేసి మరీ ఫిరాయింపుల్ని ప్రోత్సహించింది

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సన్నిహితుల కాలేజీలకే నిధులిచ్చింది

పాలమ్మితే, పూలమ్మితే వందల కోట్లు వస్తాయా ?:

అసెంబ్లీలో విద్యా విధానంపై లఘు చర్చలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 11 :** "నేను కమీషన్లు తీసుకుంటున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. ఆ అవసరం నాకేంటి!? దేవుడు నాకు అన్నీ ఇచ్చాడు. కేవలం 17.5 ఏళ్లలోనే జడ్పీటీసీ నుంచి సీఎం దాకా అన్ని పదవులూ వచ్చాయి. కోట్ల మందిలో ఒకరికి ఇచ్చే అవకాశం ఇచ్చాడు. విద్య, వ్యాపారం.. పెళ్లి, పిల్లలను ఇచ్చాడు. ఇంకా నాకు కక్కుర్తి ఎందుకు ఉంటుంది?" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తన బంధువులే జాతీయ నాయకత్వ స్థాయి వరకూ వెళ్లినా సీఎం కాలేకపోయారని, దేవుడు తనకు ఆ అవకాశం ఇచ్చాడని చెప్పారు. 'తెలంగాణ విద్యా విధానం'పై శుక్రవారం శాసన సభలో జరిగిన లఘు చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "నాకు డబ్బులే కావాలనుకుంటే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఈపాటికి వేల కోట్లు సంపాదించి ఉండేవాడిని. పుప్పాలగూడ, మంచిరేవులలో నేను ఎకరాల్లో రియల్ వ్యాపారం చేస్తున్నప్పుడు మైహోం వంటి వాళ్లు హైదరాబాద్‌లో గజాల్లో వ్యాపారాలు చేసుకుంటూ ఉన్నారు. నాతో చదువుకున్నవారు ఇప్పుడు అమెరికాలో బిలియనీర్లుగా ఉన్నారు. నేనూ వాళ్లతో వెళ్లి ఉంటే సంపాదించుకుని ఉండేవాడిని. కానీ, అవేవీ మానసిక సంతోషాన్ని ఇవ్వవనే నేను ప్రజా జీవితంలోకి వచ్చాను. కేసీఆర్ కుటుంబంలా కక్కుర్తి పడే జాతకం నాది కాదు. నాతో ఉన్నవారికి సహాయం చేసే జాతకం నాది" అని వ్యాఖ్యానించారు. తనకు ఏమీ పైశాచిక కోరికలు ఉండవని, తాను ఇంటికి వెళ్లగానే రెండు నిమిషాల్లో నిద్ర పడుతుందని అన్నారు.ప్రస్తుతం జెన్‌జీ గురించి చర్చలు జరుగుతున్నాయని, కానీ తాను జెన్ ఆల్ఫా, జెన్ బీటాలకూ ఉపయోగపడే విద్యా విధానం గురించి ఆలోచన చేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తలరాతని మార్చేది విద్య ఒక్కటేనని సంపూర్ణంగా విశ్వసించి.. ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నానన్నారు. "రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చాం. ఈ విధానాన్ని కేంద్రం అడాప్ట్ చేసుకుని పీఎం సేత్ కార్యక్రమం చేపట్టింది. దాని కింద నాలుగు క్లస్టర్లనూ తెలంగాణకు తెచ్చుకున్నాం. కేంద్రం సహకరిస్తే అభినందనలు చెబుతూనే ఉంటాం. అలాగే, మా ప్రభుత్వం మంచి పనులు చేసినప్పుడు మాకూ అభినందనలు తెలపాలి" అని వ్యాఖ్యానించా రు.విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండా లని, కానీ రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో 17 మందికి ఒకరు ఉన్నారని, అందుకే, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పది వేల మంది టీచర్లను రిక్రూట్ చేసినట్లు చెప్పారు. బడ్జెట్లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో విద్యకు బడ్జెట్లో 6.53 శాతం కేటాయింపులుంటే.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి 8.53 శాతానికి పెంచానని, మూలధన పెట్టుబడిని కూడా కలిపితే ఇది 18 శాతం దాకా ఉంటుందని వివరించారు.విద్యా శాఖ అంటే తనకు ప్యాషన్ అని, అందుకే, ఆ శాఖను తన దగ్గర ఉంచుకున్నానని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. "విద్యా శాఖకు పూర్తిస్థాయి మంత్రి లేడని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అంటున్నారు. ఆ శాఖను సీఎం నిర్వహిస్తున్నాడంటేనే.. అన్నింటి కంటే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు. విద్యా శాఖ మంత్రి సమీక్ష చేస్తే ఆ శాఖ అధికారులు మాత్రమే వస్తరు. అదే ఒక సీఎం సమీక్ష చేస్తే.. మొత్తం సిస్టమే వచ్చి అక్కడ కూర్చుంటుంది. ఈ చిన్న తేడాను కూడా సభ్యులు గుర్తించట్లేదు" అని వివరించారు.పేదలకు న్యాయం జరగాలనే తాను విద్య, న్యాయ శాఖలను ఇష్టపడి తీసుకున్నానని చెప్పారు. ప్రపంచంతో పోటీ పడేలా ప్రభుత్వ విద్యను మార్చేందుకు ప్రయత్నం చేస్తున్నానని, రెండేళ్లలో కొంత మెరుగుపడిందని, పట్టాలిక్కించిన తర్వాత పరుగులు పెడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రీ ప్రైమరీ విద్య లేకపోవడం వల్లే ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల చేరిక తగ్గుతోందని, అందుకే 4,100 స్కూళ్లలో ఇంగ్లీషు మీడియంలో ప్రీ ప్రైమరీ విద్యను ప్రారంభించామని చెప్పారు. ప్రస్తుతం (మిగతా 10లో..)



# మొదటిసారి ఎమ్మెల్యేలతో ఆగమే?




- స్వంత పార్టీ క్యాడర్‌లోనే అసంతృప్తి
- ఆత్మీయ పలకరింపులే లేవంటూ మధనం
- గెలవక ముందు ఓ తీరు.. గెలిచినంక మరో తీరు

- విషయ పరిజ్ఞానం కన్నా నోటి దురుసే ఎక్కువ
- ఇలాంటివారిని నమ్మి మళ్లీ పార్టీ టికెట్లిస్తే గోదారి ఈదినట్లే
- ఒకరిద్దరు మినహా మిగతావారి పనితీరు అంతంతమాత్రమే
- గడిచిన ఎన్నికల్లో కారు గల్లంతుకు ఇదే కారణం
- ఇప్పుడు కాంగ్రెస్ పరిస్థితి కూడా అదేనా?
- సీఎం రేవంత్ అందుకే హెచ్చరికలు చేశారా?

**గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది మొదటిసారిగా శాసనసభలో అడుగుపెట్టిన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను ఉద్దేశించి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం సీఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు వారి రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని స్పష్టం చేశారు. 'మీ ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుంది. మీ వ్యక్తిగత పనితీరే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుంది' అని హితవు పలికారు. ప్రజలు అప్పగించిన పదవిని సక్రమంగా వినియోగించుకోకపోతే రాజకీయ భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు.గడిచిన ఎన్నికల్లో గెలుపొంది వన్‌టైం వండర్‌లుగా మిగిలిపోరాదని పనితీరు మెరుగుపర్చుకుని దీర్ఘకాల ప్రజాప్రతినిధులుగా మిగిలిపోవాలని సీఎం రేవంత్ రెడ్డి చేసిన సూచన విలువైనదే.**

**గడిచిన** అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది మొదటిసారిగా శాసనసభలో అడుగుపెట్టిన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను ఉద్దేశించి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం సీఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు వారి రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని స్పష్టం చేశారు. 'మీ ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుంది. మీ వ్యక్తిగత పనితీరే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుంది' అని హితవు పలికారు. ఈ సందర్భంగా శాసనసభలో చురుగ్గా పాల్గొని ప్రజా సమస్యలను ప్రస్తావించాలని సూచించారు. అసెంబ్లీ జరిగే అన్ని రోజుల్లో సభ్యుల హాజరు సంపూర్ణంగా ఉండాలని, నియో జకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించాలని ఆదేశించారు. ప్రజలు అప్పగించిన పదవిని సక్రమంగా వినియోగించుకోకపోతే రాజకీయ భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు.గడిచిన ఎన్నికల్లో గెలుపొంది వన్‌టైం వండర్‌లుగా మిగిలిపోరాదని పనితీరు మెరుగుపర్చుకుని దీర్ఘకాల ప్రజాప్రతి నిధులుగా మిగిలిపోవాలని సీఎం రేవంత్ రెడ్డి చేసిన సూచన విలువైనదే. మొదటిసారి గెలుపొందడానికి వివిధ కారణాలు కారణం కావచ్చు.కానీ రెండోసారి గెలుపు మాత్రం ఆయా ఎమ్మెల్యేల పనితీరు,వ్యక్తిగతంగా ఆయా నియోజకవర్గాల్లో కార్యకర్తలు,జనంతో మసులుకునే తీరు ఆధారంగానే గెలుపోటములు ఉంటాయి. అన్నింటికన్నా ముఖ్యంగా స్వంత పార్టీ క్యాడర్‌తో ఆత్మీయ పలకరింపులు ఆపదలో వారిని అక్కున చేర్చుకునే నైజం వంటి అనేక అంశాలు గెలుపోటములపైన ప్రభావం చూపెడతాయి.ప్రభుత్వ వ్యతిరేకత లేదా సానుకూలత ప్రభావం ఉన్నా స్థానికంగా నెలకొన్న సమస్యలను తీర్చడంలో వ్యవహరించిన విధానం, పార్టీ కార్యకర్తలతో మేమకమవడంలో చూపిన చొరవ వంటి అంశాలు ఆయా అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయిస్తాయి. అయితే గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున చాలామంది సభ్యులు గెలుపొంది చట్టసభలో అడుగుపెట్టారు.ఇందులో కొందరు చాలాసార్లు ఓటమి చెంది గడిచిన ఎన్నికల్లో మొదటిసారిగా గెలుపొందారు. మరికొందరు మొదటిసారి పోటీ చేసి గెలుపొందినవారు ఉన్నారు.అయితే ఇప్పుడు వీరందరికి వచ్చే ఎన్నికల్లో మళ్లీ పార్టీ టికెట్ దక్కుతుందా? ఒకవేళ వారికే టికెట్ కేటాయించినా...వీరిలో గెలుపొందే వారు ఎందరు? వన్‌టైం వండర్‌గా మిగిలిపోయే వారు ఎందరు? అనే చర్చ జోరుగా సాగుతోంది. ఈ పరిస్థితుల్లో సీఎం రేవంత్ రెడ్డి నోటి నుంచి కూడా మొదటిసారిగా గెలుపొందిన సభ్యులను ఉద్దేశించి చేసిన కీలక వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా ఉన్నాయి.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడేండ్లు పూర్తికావస్తోంది. ఈ క్రమంలో ఇంకా రెండేళ్ల సమయం ఉంది.చివరి సంవత్సరం లెక్కలోకి రాదు. ఈ సంవత్సరంలో పార్టీ ఫిరాయింపులు,అసంతృప్తుల విమర్శలు.. బుజ్జగింపులు..ఇలా అనేక తెరవెనక మంత్రాంగాలు నడుస్తుంటాయి.ఈ సంవత్సరం లెక్కలోకి రాదు.ఇక మిగిలింది కేవలం ఏడాది మాత్రమే.ఈ ఏడాది పనితీరు మీదనే వారి గెలుపోటములు ఉంటాయి. బహుషా సీఎం రేవంత్ రెడ్డి దగ్గర కొత్తగా శాసన సభలో అడుగిడిన ఎమ్మెల్యేల పనితీరు నివేదికలు ఉండిఉండొచ్చు.వాటిని ఆధారంగా చేసుకునే ఆయన వారికి కీలక సూచనలు చేసి ఉండి ఉంటారు.అయితే ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలంటే కాంగ్రెస్ పార్టీ నుంచి గడిచిన ఎన్నికల్లో గెలుపొంది మొదటిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టిన వారిలో నూటికి తొంభైతొమ్మిది శాతం మంది పనితీరు బాగాలేదనే విమర్శలున్నాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఒకరిద్దరు మినహా మిగతా అందరికీ పరాభవం తప్పదనే పరిస్థితులు క్షేత్రస్థాయిలో ఉన్నాయి.దీనికి అనేక కారణాలున్నాయి.ఎమ్మెల్యేలుగా గెలుపొందిన తర్వాత వీరు పూర్తిగా మారిపోయారని, కార్యకర్తలకు అందనంత దూరంగా జరిగిపోయారనే విమర్శలు స్వంత పార్టీ కార్యకర్తలు,నేతల నుంచే ఉన్నాయి.దీనికి తోడు అభివృద్ధి మీద కాకుండా సంపాదన మీదనే చాలా మంది సభ్యుల దృష్టి ఉందనే తీవ్రమైన విమర్శలు ఉన్నాయి.ఈ పరిస్థితుల్లో స్వంత క్యాడరే పెదవి విరుస్తుంటే ఇక రెండోసారి గెలుపొందడం అంత తేలికైన వ్యవహారమేమీ కాదు.ఉదాహరణకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఓ పారిశ్రామిక ప్రాంత నియోజక వర్గంలో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఓ సభ్యుడు గెలుపొందిన తర్వాత పూర్తిగా మారిపోయారని స్వంత పార్టీ నేతలే అంటున్నారు. పలు మార్లు ఓటమి చెందిన తర్వాత గడిచిన ఎన్నికల్లో ఒక్కసారి అవకాశం ఇవ్వండంటూ కన్నీళ్లు పెట్టుకుంటే ఆ నియోజకవర్గ ప్రజలు అవకాశం ఇచ్చారు.మంచి మెజార్టీతో అసెంబ్లీకి పంపించారు. అయితే గెలుపొందిన తర్వాత సదరు సభ్యుడి మీద అనేక దందాల ఆరోపణలు చుట్టుముట్టాయి. కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు ఆత్మీయ పలకరింపే లేదని అక్కడి పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా మధనపడుతున్నారు.పార్టీ

**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఓ పారిశ్రామిక ప్రాంత నియోజక వర్గంలో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఓ సభ్యుడు గెలుపొందిన తర్వాత పూర్తిగా మారిపోయారని స్వంత పార్టీ నేతలే అంటున్నారు. పలు మార్లు ఓటమి చెందిన తర్వాత గడిచిన ఎన్నికల్లో ఒక్కసారి అవకాశం ఇవ్వండంటూ కన్నీళ్లు పెట్టు కుంటే ఆ నియోజకవర్గ ప్రజలు అవకాశం ఇచ్చా రు.మంచి మెజార్టీతో అసెంబ్లీకి పంపించారు. అయితే గెలుపొందిన తర్వాత సదరు సభ్యుడి మీద అనేక దందాల ఆరోపణలు చుట్టుముట్టాయి. కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు ఆత్మీ య పలకరింపే లేదని అక్కడి పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా మధనపడుతున్నారు**

క్యాడర్,కార్యకర్తలతో సదరు ప్రజాప్రతినిధికి ఆత్మీయ పలకరింపులు, మంచీచెడులను పట్టించుకునే నైజం లేకపోవడంతో పాటు అహంభావ వైఖరి మొండుగా ఉంది.దీంతో కార్యకర్తలంతా లోలోన రగిలిపోతున్నారు.స్వంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులకు కనీస గుర్తింపు లేకుండా మితిమీరిన భాషను ఉపయోగిస్తుండటంతో రానున్న ఎన్నికల్లో గట్టి ఎదురదెబ్బే తగిలే సూచనలు ఉన్నాయి.ఒక ప్రజాప్రతినిధి గెలుపోటముల్లో వ్యక్తిగత ప్రవర్తన కూడా బలమైన కారణంగా ఉంటుంది. ఉదాహరణకు నాటి టీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ని అవమానకరంగా గెంటివేసిన సందర్భంలో హుజురాబాద్‌కు జరిగిన ఉప ఎన్నికల్లో నాటి అధికార టీఆర్ఎస్ సర్వశక్తులు ఒడ్డి కోట్లాది రూపాయలను కుమ్మరించి,మొత్తం బలగాన్ని దింపినా అక్కడ ఈటల రాజేందరే విజయ ఢంకా మోగించడం వెనక ఉన్నది ఒక్కటే ఒక కారణం..తమ ప్రజాప్రతినిధి ఈటల రాజేందర్ తమతో ఆత్మీయ పలకరింపుతోపాటు తమని కలవడానికి వచ్చే ప్రజలు, కార్యకర్తలతో ఈటల సతీమణి జమునా రెడ్డి చూపెట్టే ఆత్మీయ పలకరింపు,దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికోసం భోజన ఏర్పాట్లు చేయడం వంటి వ్యక్తిగత శ్రద్ధ మూలంగానే అధికార పార్టీని తట్టుకుని నిలబడేలా చేసిందని చెప్పడం అతిశయోక్తిగా అన్పించవచ్చు.కానీ నాటి ఉప ఎన్నికల సందర్భంగా నా క్షేత్రస్థాయి పరిశీలనలో అక్కడి జనం మాట ఇది.అయితే నేడు కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు తమని కలవడానికి వచ్చే ప్రజలు, కార్తకర్తలతో సక్రమంగా మలచుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.తమని కలవడానికి వచ్చే నియోజకవర్గ ప్రజలు,పార్టీ కార్యకర్తలు,స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఆత్మీయ పలకరింపే ఉండటం లేదని అంటున్నారు.తామేదో ఆకాశం నుంచి ఊడిపడినట్లుగా అధికార దర్పం ప్రదర్శించడంతోపాటు భజన పరుల హంగామా, కాన్వాయ్‌ల నడుమ నిరాడంబరతే లేకుండా శాలువాలు,పూల బొకేల నడుమ అదిగో అన్న..ఇదిగో పులి..అంటూ సామాజిక మాధ్యమాల్లో స్వంత డప్పుకొట్టుకుంటున్న వైనం మెజార్టీ నియోజకవర్గాల్లో ఉంది. ఇలాంటి ఎమ్మెల్యేలు వన్‌టైం వండర్‌గా మిగిలిపోతున్నారనే సంకేతాలు ఉన్నాయి.ఇదే విషయం ముందుగానే గమనించిన సీఎం రేవంత్ హెచ్చరికలు జారీ చేశారనే అనుకోవాలి.గడిచిన ఎన్నికల్లో గెలుపొంది మొదటిసారి చట్టసభలో అడుగుపెట్టిన కొందరు ప్రజాప్రతినిధులు విషయ పరిజ్ఞానం పెంచుకోవడం మీద దృష్టి నిలపకుండా కేవలం అధిష్టాన మెప్పుకోసం ప్రత్యర్థి పార్టీ నేతల మీద బూతుల దండకాలు చదవడం,మితిమీరిన విమర్శలు చేయడం గమనార్హం. ఇలాంటివారందరికీ వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదనే భావన ప్రజల్లో ఉంది. సీఎం రేవంత్ హెచ్చరించినట్లు..వ్యక్తిగత పనితీరు ఆధారంగానే మళ్లీ గెలుపొందగలుగుతారన్నది నూటికి నూరుశాతం నిజం.భూ దందాలు,బూడిద దందాలు చేసి అడ్డగోలు సంపాదనలకు తెగబడిన వారి విషయంలో పార్టీ మేల్కొకపోతే వచ్చే ఎన్నికల్లో పార్టీకి మిగిలేది శూన్య హస్తమే.ఇప్పటికే పలు రకాల దందాలతో పార్టీకి,ప్రభుత్వానికి చెడ్డపేరు తీసు కొచ్చిన వారికి వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇవ్వరాదనే ప్రచారం ఊపందుకున్నది. పనితీరు ఆధారంగా, క్షేత్రస్థాయిలో పటిష్టమైన సర్వే జరిపి వారి గెలు పోటమును బేరీజు వేసుకున్న తర్వాతనే పార్టీ టికెట్లు కేటాయించాలనే వాదం బలంగా విన్పిస్తోంది.గడిచిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేకత మీద వచ్చిన గాల్లో గెలుపొందిన వారందరికి సిట్టింగుల హోదాలో మళ్లీ పార్టీ టికెట్లు ఇస్తే నాడు కారు గల్లంతయినట్లే.. నేడు అధికార పార్టీ హస్తవ్యస్తం కాక మానదు.అధికారం అంటే అది బాధ్యత అని అనుకోకుండా ఒక్కసారి అధికారం దక్కితే తామేదో దైవాంశ సంభూతులుగా ఊహించుకుంటూ మితిమీరి వ్యవహరిస్తున్న ప్రజాప్రతినిధులకు అన్ని పార్టీలు తిరిగి టికెట్లు ఇవ్వకపోవడమే ఆయా పార్టీలకు శ్రేయస్కరం.మరి ఆ దిశగా కాంగ్రెస్ పార్టీ అడుగులు వేయాలి.సీఎం రేవంత్ తన వద్ద ఉన్న సమాచారం ఆధారంగా మొదటిసారి గెలుపొందిన శాసనసభ్యులను ఉద్దేశించి సీరియస్‌గా సూచనలు చేశారా? లేక ఏదో యాదృచ్ఛికంగా అన్నారో తెలియదు కానీ..కాంగ్రెస్ నుంచి గడిచిన ఎన్నికల్లో గెలుపొంది మొదటిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టిన వారిలో ఒకరిద్దరు మినహా మొత్తం ఇంటిదారి పట్టడం ఖాయమే.మరి ఇప్పటినుంచే ఇలాంటివారందరికి ప్రత్యామ్నాయంగా అభ్యర్థులను తయారు చేసుకోవడం మేలు.లేదంటే సిట్టింగుల హోదాలో మళ్లీ వారికే హస్తం గుర్తు టికెట్లు కేటాయిస్తే గడిచిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఎదురైన పరాభవమే ఉంటుంది.నాడు సిట్టింగుల్లో కొంత మందిని మార్చి ఉండి ఉంటే మళ్లీ బీఆర్ఎస్‌కే అధికారం దక్కి ఉండేది. ఇప్పుడు కాంగ్రెస్ పరిస్థితి కూడా అలానే ఉంది.సిట్టింగుల్లో మూడొంతుల మందిని మార్చి కొత్త ముఖాలకు అవకాశం ఇస్తే గెలుపు మీద ఆశలు ఉన్నట్లే.మరి ఈ విషయం అధిష్టానం గమనిస్తుందో లేదో చూడాలి.

......................

**మానసాని కృష్ణా రెడ్డి**
**9618616110**
**8074124190**

................

## కొండా సురేఖకు మీనాక్షి ఫోన్!

**క్రియాశీలకంగా మారాలని సూచన**

**బర్తరఫ్ తరువాత అసెంబ్లీకి రాని సురేఖ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 :** మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్ ఫోన్ చేసి మా ట్లాడారు. అంతర్గత విభేదాలు, వ్యక్తిగత కారణాలను పక్కన పెట్టి పార్టీ కార్యక్రమాల్లో తిరిగి క్రియాశీలకంగా మారాలని కొండా సురేఖ కు సూచించినట్టు తెలిసింది. సురేఖ మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన తర్వాత అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదు. పార్టీ అధిష్ఠానం నుంచి స్పష్టమైన సూచనలు రావడంతో, ఇకనుంచి అసెంబ్లీ సమావేశాలకు కొండా హాజరవుతారా? లేదా? అన్న అంశంపై ఉత్కంఠ నెలకొన్నది.

## బలహీన దేశాలకు జీ7 పేరెందుకు?

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనాలను కొనసాగించే దేశాలపై అదనపు ఆంక్షలను ఉపయోగించడాన్ని ఆయన విమర్శించారు. రష్యాపై 30,000కు పైగా ఆంక్షలు విధించారు. ఇది ప్రపంచంలోని మిగిలిన దేశాలన్నింటిపైనా కలిపి విధించిన ఆంక్షల సంఖ్యకు రెట్టింపు అని ఆయన పేర్కొన్నారు. ఆంక్షలు ఉన్నప్పటికీ రష్యా తన సార్వభౌమాధికారాన్ని బలోపేతం చేసుకుందని, విశ్వసనీయమైన, ఊహించదగిన భాగస్వాములతో సంబంధాలను విస్తరించుకుందని, ఆర్థిక వృద్ధిని కొనసాగించిందని పుతిన్ అన్నారు. గత మూడేండ్లుగా రష్యాలో ఆర్థిక వృద్ధి ప్రపంచ సగటు కంటే ఎక్కువగా ఉందని ఆయన అన్నారు.

అంతకుముందు, భారత్ మండపంలో జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, పుతిన్‌తో దాదాపు 45 నిమిషాలపాటు సమావేశమయ్యారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా వెలుపల జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పుతిన్ స్వయంగా పాల్గొనడం ఇదే మొదటిసారి. అలాగే ఈ ఏడాది మోదీ, పుతిన్ మధ్య జరిగిన రెండవ సమావేశం కూడా ఇదే. ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి చర్చలు, దౌత్యమే ఏకైక మార్గమని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. అలాగే శాంతి ప్రయత్నాలకు మద్దతు ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ, ఆర్థిక, రక్షణ, ఇంధన, అంతరిక్ష




రంగాలలో సహకారంతోపాటు నైపుణ్యం కలిగిన వారి రాకపోకలు, ప్రజల మధ్య సంబంధాలపై ఇద్దరు నాయకులు సమీక్ష జరిపారు. భారత్ సారథ్యంలో బ్రిక్స్ 2026లో అంతర్గత సహకారాన్ని మోదీ, పుతిన్ సమీక్షించారు. భారత్-రష్యా ప్రత్యేక, విశిష్ట వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి వారు అంగీకరించారు.

### వినాయక విగ్రహాల ఏర్పాటుకు

# పోలీసుల అనుమతి తప్పనిసరి

**విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో సమాచారం అందించాలి**

**నిబంధనలకు లోబడి ఉత్సవాలు నిర్వహించాలి**

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**వాస్తవం : గోదావరిఖని**

ఈ నెల 14న సోమవారం వినాయక చవితి పండుగ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి మంచిర్యాల జిల్లాల్లో మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించాలనుకునే వారు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి పొందాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు వినాయక విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా మండప నిర్వాహకులు గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు వాలంటీర్ల పేర్లు ఫోన్ నంబర్లు చిరునామా తదితర వివరాలను కూడా పూర్తిగా నమోదు చేయాలని సూచించారు పెద్దపల్లి మంచిర్యాల జిల్లాల్లోని పట్టణాలు గ్రామాల్లో ఏర్పాటు చేసే గణపతి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేయాలని కమిషనర్ సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా కమిషనరేట్ పోలీస్ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉండి అప్రమత్తంగా ఉంటుందని అత్యవసర సమయంలో వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని తెలిపారు. మండపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ నిబంధనలకు లోబడి ఉత్స వాలను ప్రశాంతంగా నిర్వహించాలని పోలీస్ కమిషనర్ సూచించారు.



# విద్య,వైద్యం,ఉపాధి, హక్కుల కోసం ఉద్యమిస్తాం

**దొంతరవేణి మహేష్**

**ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు**

**వాస్తవం : బెజ్జంకి**

విద్య, వైద్యం, ఉపాధి, యువజన హక్కుల కోసం ఉద్యమిస్తామని ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దొంతరవేణి మహేష్ యాదవ్ స్పష్టం చేశారు. సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో యాదగిరిగుట్టలో జరిగిన అఖిల భా రత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల్లో బెజ్జంకి మండలానికి చెందిన దొంతరవేణి మహేష్ ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా దొంతరవేణి మహేష్ మాట్లాడుతూ యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మరింత బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామని మహేష్ తెలిపారు. ముఖ్యంగా యువతకు విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతపై ఆర్థిక భారం పడకుండా పరీక్షల ఫీజులను తగ్గించాలని, ఉద్యోగ నోటిఫికేషన్లలో జాప్యం లేకుండా ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్‌ను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంత యువతకు నాణ్య మైన విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. యువతను మత్తు పదార్థాలు, డ్రగ్స్ వంటి వ్యసనాల నుంచి కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. యువత భవిష్యత్తు కోసం పోరాడటం మా బాధ్యత. విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగం, సామాజిక న్యాయం, యువజన హక్కుల సాధన కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు కొనసాగిస్తాం. యువత సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహి స్తాం" అని దొంతరవేణి మహేష్ స్పష్టం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ బెజ్జంకి మండలంతో పాటు సిద్దిపేట జిల్లాలో, రాష్ట్రవ్యాప్తంగా యువజన ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.



# డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులుగా కవిడే సురేష్ ఎన్నిక

**వాస్తవం : వలిగొండ**

భారతప్రజాతంత్రయువజన సమాఖ్య డివైఎఫ్ఐ యాదాద్రిభువనగిరి జిల్లా అధ్యక్షులుగా వలిగొండ మండల పరిధిలోని గోకారం గ్రామానికి చెందిన కవిడే సురేష్ 9,10 తేదీలలో చౌటుప్పల్ పట్టణంలో జరిగినజిల్లా 3వ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కవిడే సురేష్ మాట్లాడుతూ నేనుగతంలో ఎస్ఎఫ్ఐ సభ్యుడిగా గ్రామ శాఖ అధ్యక్షుడుగా మండల కార్యదర్శిగా జిల్లాఅధ్యక్షుడిగా రాష్ట్ర కమిటీ సభ్యుడిగా జిల్లా వ్యాప్త విద్యార్థుల సమస్యలపైన పనిచ చేశాను. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జరిగిన సైకిల్ యాత్రలో పాల్గొని వారి సమస్యల పరిష్కారంలో ఉద్యమించానని సంఘంలో మండల అధ్యక్ష కార్యదర్శి బాధ్యతతోపాటుగా జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచే సాను. ఈ జిల్లాలో మత్తుపదార్థాలకు,గంజాయికి అలవాటుపడుతున్న యువతను చైతన్యం చేయడం కోసం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సైకిల్ యాత్రలో పాల్గొనడం జరిగింది. అదే విధంగా భవిష్యత్తులో ఈ జిల్లాలో ఉన్నటువంటి కెమికల్,ప్రైవేట్ పరిశ్రమలలో స్థానిక నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు కల్పించాలని,నిరుద్యోగ యువకులకు ఎన్నికల సమయంలో వారికి ఇచ్చిన వాగ్దానాల అమలుకోసం పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు.



# మిల్లర్లపై కొరడా.. బకాయిలపై మౌనమా!

**2014 నుంచి బకాయిలు పెండింగ్..**

**నాణ్యతపై మాత్రం నిఘా ఎందుకు?**

**ఆంధ్రలో రూ.120.. తెలంగాణలో రూ.10 మిల్లింగ్ ఛార్జీ!**

**విజిలెన్స్ తనిఖీలపై 40 మంది మిల్లర్ల ఆందోళన**

**వాస్తవం : బాన్సువాడ**



రైస్ మిల్లర్లపై విజిలెన్స్ తనిఖీలు, బియ్యం నాణ్యతపై కఠిన నిబంధనలు, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలు, నామమాత్రపు మిల్లింగ్ ఛార్జీలతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాన్స్‌వాడ నియోజకవర్గానికి చెందిన రైస్ మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సుమారు 40 మంది మిల్లర్లు ఆర్డీవోకి మెమోరాండం సమర్పించారు. 2014 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని మిల్లర్లు తెలిపారు. తాము ప్రభుత్వానికి అందించే ధాన్యం, బియ్యం నాణ్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెడుతున్నప్పుడు, మిల్లర్లకు రావాల్సిన బకాయిలపై కూడా అదే స్థాయిలో శ్రద్ధ చూపాలని ప్రశ్నించారు. బకాయిల సమస్యను పరిష్కరించకుండా నాణ్యత, తనిఖీల పేరుతో ఒత్తిడి పెంచడం సరికాదన్నారు. రైతుల నుంచి వర్షాలకు తడిసిన ధాన్యం మిల్లులకు వస్తుండటంతో మిల్లింగ్ సమయంలో నాణ్యత సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో పండుతున్న ధాన్యం గట్టి నాణ్యతతో లేకపోవడంతో ప్రభుత్వం కోరుతున్న ప్రమాణాలకు అనుగుణంగా బియ్యం తయారు చేయడం కష్టంగా మారుతోందన్నారు. మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ప్రభుత్వానికి సమర్పించే సమయంలో నాణ్యత ప్రమాణాల పేరుతో లారీలు రిజెక్ట్ అయితే ఒక్కో లారీకి సుమారు రూ.60 వేల వరకు నష్టం వస్తోం దని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లింగ్ ఛా ర్జీల విషయంలోనూ తెలంగాణ మిల్లర్లకు అన్యా యం జరుగుతోందని వారు పేర్కొన్నారు. ఆంధ్రప్ర దేశ్‌లో క్వింటాల్‌కు రూ.120 వరకు మిల్లింగ్ ఛార్జీలు ఇస్తుండగా, తెలంగాణలో కేవలం రూ.10 మాత్రమే ఇస్తున్నారని మిల్లర్లు తెలిపారు. విద్యుత్, కార్మికులు, యంత్రాల నిర్వహణ, ఇతర ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో ఈ ఛార్జీలతో మిల్లింగ్ నిర్వహించడం సాధ్యం కావడం లేదని వాపో యారు. గత ఎనిమిదేళ్లుగా మిల్లింగ్, రవాణా ఛార్జీలను పెంచలేదని మిల్లర్లు తెలిపారు. ధాన్యం ఇచ్చిన మూడు నెలల్లోపు బియ్యం తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎండాకాలంలో పచ్చి బియ్యం ఇవ్వడం వల్ల నూకలు పెరిగే అవకా శం ఉన్నందున బాయిల్డ్ రైస్ సమర్పించేందుకు అ వకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తాము ప్రభుత్వానికి ఇవ్వాల్సిన ధాన్యం, బియ్యం నాణ్యతపై అధికారులు ఎంత శ్రద్ధ చూపుతున్నారో, ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన బకాయిలు, మిల్లింగ్ ఛార్జీలపై కూడా అంతే శ్రద్ధ చూపాలని మిల్లర్లు డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయి తే నిబంధనలు పాటిస్తున్న మిల్లర్ల సమస్యలను చర్చ ల ద్వారా పరిష్కరించాలని కోరారు. మిల్లర్ల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పెండింగ్ బకాయిలు, మిల్లింగ్ ఛార్జీలు, ధాన్యం నాణ్యత, బియ్యం రిజెక్షన్ల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగులగమ వెంకన్న గుప్తా, శ్రీనివాస్ రెడ్డి,సంతోష్, ఏర్వాల కృష్ణారెడ్డి, రాజెశ్వర్, ఎల్లరెడ్డి, రామకృష్ణ, హన్మాండ్లు,నిఖిల్, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంభానికి ఆర్థిక సాయం అందజేసిన వాకిటి



**వాస్తవం : వలిగొండ**

వలిగొండ మండల సీనియర్ రిపోర్టర్ ఆలకుంట్ల కృష్ణ మాతృమూర్తి ఆలకుంట్ల మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెముడాల అనిత నర్సింగ్ యాదవ్, బొడ్డు వెంకట రమణ రెడ్డి, వలిగొండ పీఏసీఎస్ డైరెక్టర్ కల్కూరి చంద్రయ్య, ఉప సర్పంచ్ బూడిద నాగరాజు, శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ గంజి అశోక్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు చెవ్వ మధు ముదిరాజ్, వార్డు సభ్యులు ఉక్కుర్తి పద్మ నరసింహ, నిమ్మల వెంకటయ్య, పోలేపల్లి ప్రభాకర్, మారబోయిన మత్స్యగిరి, గంగదారి అశోక్,ఉకుర్తి శీను, బోదాసు దుర్గయ్య, పిట్టల వెంకన్న, ఆలకుంట్ల రాములు, బూడిద రమేష్ పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో



**వాస్తవం : చందుర్తి**

రైతులకు సాగునీరులేక పొట్ట దశలో ఉన్న వరి పొలాలు ఎండుతున్నాయని, కరెంటు కోతలు విధించడం పట్ల భారతీయ జనతా పార్టీ చందుర్తి మండల శాఖ అధ్యక్షులు మొకిలే విజేందర్ ఆధ్వర్యంలో వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారి మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద శుక్రవారం రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విజేందర్ మాట్లాడుతూ...కరువు అంటే కాంగ్రెస్.. బీఆర్ఎస్ పార్టీ విఫలమైందని, కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించినా రైతుల బాధలను పట్టించుకోవడంలేరని, ఎల్ నివో ప్రభావంతో ఎంతో కొంత వర్షంతో కాలువలు పారుతుండగా ఉండగా ఆశతో రైతులు వేసిన వరి పొలాలు కరెంటు కోతలతో ఎండుతున్నాయని, తక్షణం వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందించి కరెంటు కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అల్లాడి రమేష్, మార్త సత్తయ్య, మద్రి(షిరిడి) మల్లేశం, చింతకుంట గంగరాజు, పెరుక గంగరాజు, మొత్కుపల్లి రాజశేఖర్, మద్రి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17ని తెలంగాణ రాష్ట్ర విమోచన దినంగా అధికారంగా ప్రకటించాలి



**వాస్తవం : చందుర్తి**

సెప్టెంబర్ 17న తెలంగాణ రాష్ట్ర విమోచన దినంగా అధికారకంగా ప్రకటించాలని భారతీయ జనతా పార్టీ చందుర్తి మండల శాఖ అధ్యక్షులు మొకిలే విజేందర్ కోరారు. బిజెపి జిల్లా శాఖ ఆదేశాల మేరకు బీజేపీ మం డల శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మొకిలే విజేందర్ మాట్లాడుతూ... త్యాగాల ఫలితంగా కేంద్ర హోం శాఖ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించినా విలీనం చేశారని, ఎన్నోసార్లు వినతులు చేసిన ఫలితం రాలేదని, ప్రభుత్వం తక్షణం తెలంగాణ రాష్ట్ర విమోచన దినాన్ని అధికారిక ప్రకటించాలని, పాఠ్యపుస్తకాల్లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర చరిత్రను చేర్చాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అల్లాడి రమేష్, మార్త సత్తయ్య, మద్రి(షిరిడి )మల్లేశం, మొత్కు పల్లి రాజశేఖర్, చింతకుంట గంగరాజు, పెరుక గంగరాజు, మద్రి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానానికి బియ్యం విరాళం

**వాస్తవం : వేములవాడ**



మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వేములవాడ మున్సిపల్ పరిధిలోని కొనాయిపల్లి వాస్తవ్యులు గొనె మల్లారెడ్డి- అయిలవ్వ దంపతులు ట్రస్ట్ ద్వారా గత 1979 రోజులుగా దాతల సహకారంతో అన్నార్తులకు పేదలకు ట్రస్ట్ నిర్వహించిన అన్నదాన కార్యక్రమం గురించి శుక్రవారం 50కిలోల సన్నబియ్యం అందించారని ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్ తెలిపారు. పేదల ఆకలి తీర్చాలన్న వారి గొప్ప ఆలోచనను అభినందిస్తూ గొనె మల్లారెడ్డి- అయిలవ్వ దంపతులను శాలువాతో సత్కరించి ట్రస్ట్ సభ్యుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. వేములవాడ రాజన్న ఆశీస్సులతో వారి కు టుంబ సభ్యులు నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుతున్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం.... పర్యావరణాన్ని రక్షిద్దాం

**వాస్తవం : వేములవాడ**




రానున్న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడలోని పీఎం శ్రీ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేశారు. పాఠశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో బంకమట్టిని సేకరించి శుద్ధి చేసి సుమారు 100 మట్టి వినాయక ప్రతిమలను స్వయంగా తయారు చేశారు.అనంతరం విద్యార్థులు మేళతాళాలతో పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అర్బన్ తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ఎంఆర్ సీ, మున్సిపల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, జూనియర్ కళాశాల తదితర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారులకు మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పీఎం శ్రీ గర్ల్స్ హైస్కూల్ ఎకో క్లబ్ ఇన్‌చార్జి బొజ్జ కృష్ణ మాట్లాడుతూ.... రోజురోజుకూ పర్యావరణం కాలుష్యానికి గురవుతున్న నేపథ్యంలో మానవాళి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. పండుగలు, సంప్రదాయాలను గౌరవిస్తూనే ప్రకృతికి ఎలాంటి హాని కలగకుండా నిర్వహించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, భవిష్యత్తులో పర్యావరణ సమస్యలు మరింత తీవ్రమవకుండా ప్రతి కార్యక్రమాన్ని పర్యావరణహితంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించేందుకు మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేసినట్లు తెలిపారు. మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బన్నాజీ, ఉపాధ్యాయులు బొజ్జ కృష్ణ, హరికృష్ణ, సత్యనారాయణ, బాలరాజు, యాదగిరి, మాధవి, సరిత, రాధిక, అరుంధతి, సుచరిత, సవిత, సునీత, అనిత, రవీందర్‌రావు, మొయినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులను తయారు చేసి ఆదర్శంగా నిలిచిన విద్యార్థులు

**అభినందించిన ఉపాధ్యాయులు**

**వాస్తవం : నిర్మల్ ప్రతినిధి**



నిర్మల్ జిల్లా సోన్ మండలం మాదాపూర్ గ్రామంలోని షైనింగ్ స్టార్ స్కూల్లో విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేశారు.వినాయక చవితి పండుగ వస్తోందంటే చాలు నవరాత్రుల హడావుడి, రంగురంగుల విగ్రహాల సందడి మొదలవుతుంది. అయితే, ఈ పండుగ వేడుకల్లో పర్యావరణానికి జరుగుతున్న నష్టాన్ని గమనించి, దానికి అడ్డుకట్ట వేయాలని సంకల్పించారు విద్యార్థులు. "ప్రకృతిని కాపాడదాం – పండుగను ఆనందంగా జరుపు కుందాం" అనే నినాదంతో విద్యార్థులు మట్టి వినా యక విగ్రహాల తయారీలో సరికొత్త విప్లవానికి శ్రీకారం చుట్టారు. తాము కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యత గల పౌరులమని చేతల్లో నిరూపించారు.విద్యార్థులు తాము తయారు చేసిన విగ్రహాలను కేవలం పాఠశాలకే పరిమితం చేయలేదు.స్థానిక కాలనీల్లో, వీధుల్లో పర్యటించి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల జరిగే నష్టాలను ప్రజలకు వివరించారు. తాము స్వయంగా తయారు చేసిన మట్టి వినాయకులను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసి, వారి ఇళ్లలో కూడా మట్టి వినాయకులనే ప్రతిష్ఠించేలా ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు చేసిన ఈ సామాజిక ప్రయత్నంపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రిన్సిపాల్ సాబీర్ ఉప సర్పంచ్ ప్రశాంత్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# మట్టి గణపతితో పర్యావరణాన్ని కాపాడుదాం

**సనుగుల గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ**

**ఎన్గల్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మట్టి గణపతి తయారుచేసి పంపిణీ**

**వాస్తవం : చందుర్తి**





మట్టి గణపతిని పూజిద్దాం,పర్యావరణాన్ని కాపాడుకుందామని చందుర్తి మండలం సనుగుల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్కూరి ముఖేష్ అన్నారు. విద్యార్థులు మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను శుక్రవారం ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రకృతిని కాపాడేందుకు చిన్ననాటి నుంచే మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులతో మట్టి వినాయకుల తయారీ చేయించి రంగులు అద్దని వినాయకులను ఇంటింటా అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేకల పద్మ, నాతరి నాగమణి, చింతల హరిష్మా దుంపెట మమత, ఎగోళం మాదవి విద్యార్థులు పాల్గొన్నారు.అలాగే మండలంలోని ఎన్గల్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మట్టి గణపతి పపర్యావరణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ మట్టి వినాయక ప్రతి మలు విద్యార్థులచే తయారు చేపించి విద్యార్థులకు ప్రధా నోపాధ్యాయులు వంగ తిరుపతి విద్యార్థులకు వివరించారు.ప్లాస్టరాఫ్ పారిస్‌తో తయారు చేసిన ప్రతి మలు, విగ్రహాలు వాడకం వల్ల నదుల్లో ,చెరువుల్లో నీరు కలుషితమై పర్యావరణం దెబ్బతింటుందని మట్టి విగ్రహాలను పూజించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి శ్రీలత, టి సంజీవ్ కుమార్, సుమలత, పల్లవి, గీత, సంఘవి, విద్యార్థులు పాల్గొన్నారు.

# అమరవీరులకు నివాళులర్పించిన ఎల్లంకి మహేష్




**వాస్తవం : వలిగొండ**

వలిగొండ మండల కేంద్రంలోని వేములకొండ గ్రామంలోతెలంగాణసాయుధ పోరాటయోధులుకామ్రేడ్ పులిపలుపుల రామలక్ష్మయ్య, కేశిరెడ్డి అనంతరెడ్డి, నీలంచెన్నయ్య, కాడి గళ్ళ సాయిలు, ఎం.డి ఖాజామైనుద్దీన్‌ల అమరవీరుల స్థూపానికి పూలమల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సిపిఐ మండల సహాయ కార్యదర్శి కామ్రేడ్ ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ ఆనాటి నిజాం నిరంకుశ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడినకమ్యూనిస్టులు సెప్టెంబర్ 11 న సాయుధ పోరాటనికిరావినారాయణరెడ్డి ,బద్దం ఎల్లారెడ్డి , మాగ్ధుమ్ మోహినుద్దీన్‌లు పోరాటానికి పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో నాలుగు వేల మంది వీరులు నేలకు ఒరిగారన్నారు. ఆనాటి నిజాం నిరంకుశ నియం తృత్వానికి వ్యతిరేకంగా పోరాడి భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం మట్టి మనుషులు నడిపిన మహత్తర పోరాటం. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అని ఈసందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్య క్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పోలేపాక యాదయ్య, ఏఐవై ఎఫ్ మండలఅధ్యక్షులు మారోజు నరసింహ చారి, గ్రామ శాఖ కార్యదర్శి పులి పల్పుల మల్లేశం, తాలూకా యాదగిరి, చంద్రగిరి చంద్రయ్య, బుంగ చక్రపాణి, తాలూకా నర్సమ్మ, కాడిగళ్ల పెంటయ్య పాల్గొన్నారు.

# వినోబా భావే ఆశయాలను కొనసాగించాలి

**గాజుల అనిల్ కుమార్**



**వాస్తవం : అందోల్**

స్వాతంత్ర సమరయోధుడు, భూదానోద్యమ పితామహుడు వినోబాభావే ఆశయాలను కొనసాగించాలని తెలంగాణ సర్వోదయ మండల్ సంగారెడ్డి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అందోల్ నియోజకవర్గ ఇంచార్జ్ గాజుల అనిల్ కుమార్ అన్నారు .వినోభాభావే 131వ జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాజుల అనిల్ కుమార్ మాట్లాడుతూ వినో బా భావే పేద ప్రజల ప్రయోజనాల కోసం 14 సంవత్సరాల పాటు పాద యాత్ర చేసి భూదానోద్యమం ద్వారా భూములను సేకరించారని అన్నారు. అయన సేకరించిన భూములు పేద ప్రజలకు అందక ఆక్రమణలకు గురి కావడం దురదృష్టకరమని అన్నారు.ఈ కార్యక్రమంలొ భూదాన్ మండల నాయకులు చిరంజీవి, దార్మిక సేవా సమితి సభ్యులు కరునేశ్వర్, పల్లె రమేష్, మణికంఠ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నెరవేరిన దశాబ్దాల కల

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం**



**వాస్తవం : బెజ్జంకి సెప్టెంబర్ 11**

బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ళ– వింజపల్లి గ్రామాల మధ్య రూ. 1.75 కోట్ల నిధులతో కాజ్ వే నిర్మాణానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తూ పరిపాలన అనుమతులను ఇచ్చింది. శుక్రవారం ముగ్గుల మాజీ సర్పంచ్ చేప్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చెప్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ..ఇరు గ్రామాలకు చెందిన ప్రజల చిర కాల కోరిక కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ గ్రామ రైతులు, గీత కార్మికులు, హర్షం వ్యక్తం చేశారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల

ప్రకటనల కోసం సంప్రదించండి

8074124190



# వేములవాడ రాజన్న ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**
**అధికారులతో సమీక్ష**




**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ పట్టణంలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం నిర్మాణం, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆర్ అండ్ బి, ఇతర శాఖల అధికారులతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై ఆరా తీశారు. వేములవాడ తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు 80 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మురికి నీటి కాలువ, విద్యుత్ టవర్ల నిర్మాణం, రోడ్డు నిర్మాణ పనులపై ఆరా తీశారు. ఒక్కో పనిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో అడిగి తెలుసుకున్నారు. ఆయా శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధునాతన గోశాల పురోగతిపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, నిర్మాణ ప్రక్రియలో జాప్యం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని తెలిపారు. ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసేందుకు మరింత మంది కూలీల సంఖ్యను పెంచాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను పరిశీలించిన కలెక్టర్ గడువులోగా ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పనులు పూర్తి చేసేలా చూడాలని సూచించారు. వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ఆయా శాఖల అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, పనులు వేగంగా పూర్తి అయ్యేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈకార్యక్రమాల్లో ఆలయ ముఖ్య కార్యాచరణ అధికారి ఎల్ రమాదేవి, వేములవాడ ఆర్ డి ఓ కెఎస్ బి కుమారి, ఆర్ అండ్ బి ఎస్ఈ భీమ్లా నాయక్, డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ లోకేష్, నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, తహసీల్దార్ జయంత్, రాజన్న ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**నాయబ్ తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేసిన బీజేపీ శ్రేణులు**



**వాస్తవం : బెజ్జంకి:**

రాజకీయాలకు అతీతంగా సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, అమరవీరులకు ఘన నివాళులు అర్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బెజ్జంకి నాయబ్ తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొలిపాక రాజు మాట్లాడుతూ తెలంగాణ విమోచన పోరాటంలో పాల్గొన్న వీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, వారి పోరాట స్ఫూర్తిని నేటి యువతకు తెలియజేసేలా రాష్ట్రవ్యాప్తంగా అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కొలిపాక రాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ బుర్ర మల్లేశం గౌడ్, గుగ్గిళ్ల సర్పంచ్ గుగ్గిళ్ల మల్లయ్య, మండల నాయకులు సంఘ రవి, గైని రాజు, దొమ్మాటి రాములు, వడ్లూరు సాయిలు, గంప రవికుమార్, జెల్లా అనిల్, బెజ్జంకి రాజమల్లు, బుర్ర కిషన్, గాండ్ల శీను, వడ్లూరు శ్రీనివాస్, లోనే నర్సింగం, ధోనే అంజన్న, బోనగం నరేష్, చంద్రయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌టీపీసీ సీఎస్ఆర్-సీడీ నిధులను సద్వినియోగం చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**
**విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి**
**ఎన్‌టీపీసీ ప్రభావిత గ్రామాల అభివృద్ధికి నిధులను సమర్థవంతంగా వినియోగించాలి**



**వాస్తవం : పెద్దపల్లి జిల్లా ప్రతినిధి**

శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధ్యక్షతన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి ఎన్‌టీపీసీ సీఎస్ఆర్--సీడీ నిధుల వినియోగంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్‌టీపీసీ సీఎస్ఆర్--సీడీ నిధులను ఎంత మేరకు, ఏయే రంగాల్లో సమర్థవంతంగా వినియోగించవచ్చనే అంశంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాకు అందుబాటులో ఉన్న ఎన్‌టీపీసీ సీఎస్ఆర్--సీడీ నిధులను సద్వినియోగం చేసేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా విద్యా రంగం, వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌టీపీసీ ప్రభావిత గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఎన్‌టీపీసీ ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, వాటి అభివృద్ధికి సీఎస్ఆర్--సీడీ నిధులను వినియోగించేలా ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. గ్రామాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతులకు సంబంధించిన అవసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఎన్‌టీపీసీ సీఎస్ఆర్--సీడీ నిధులు వృథా కాకుండా, నిబంధనలకు అనుగుణంగా అత్యంత సమర్థవంతంగా వినియోగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నిధుల మేరకు చేపట్టగల పనులను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలను రూపొందించి తదుపరి చర్యలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, జిల్లాలో సీఎస్ఆర్--సీడీ నిధుల ద్వారా చేపట్టే పనులు ప్రజలకు గరిష్ట ప్రయోజనం చేకూరేలా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి. గంగయ్య, సీపీఓ రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సేవలు మెరుగుపరచడమే లక్ష్యం

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**వాస్తవం : నిర్మల్ ప్రతినిధి**

జిల్లాకేంద్రంలో నీ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే ప్రజలకు మెరుగైన,నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యాధికారులు,వివిధ విభాగాల అధిపతులతో కలెక్టర్ సమావేశమై ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సమీక్షించారు. రోజువారీగా నమోదవుతున్న ఓపీ వివరాలతో పాటు వివిధ విభాగాల్లో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, రేడియాలజీ, ఈఎన్‌టీ తదితర విభాగాల్లో వైద్య సేవల మెరుగుదలకు అవసరమైన పరికరాలు, శస్త్రచికిత్సలకు అవసరమైన యంత్రాల వివరాలను ఆయా విభాగాల అధిపతుల నుంచి సేకరించారు. అవసరమైన పరికరాలను ప్రాధాన్యత క్రమంలో సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సౌకర్యవంతంగా వైద్య సేవలు అందేలా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. సదుపాయాలు మెరుగుపడితే మరింత మంది రోగులకు ఆసుపత్రిలోనే మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పార్కింగ్ స్థలాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, అధికారులు రమేష్, సరోజ, వైద్యులు, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుడ్ టచ్..బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన




**వాస్తవం : మాడుగుల**

పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ ఇర్విన్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థినీ, విద్యార్థులకు బాలల భద్రత, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, మహిళలు. బాలికల రక్షణ తదితర అంశాలపై షీ టీం ఇంచార్జి జగదీశ్వర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న షి టీం కానిస్టేబుల్ జ్యోతి మాట్లాడుతూ చిన్నారులు ఎదుర్కొనే వేధింపులు, అసభ్య ప్రవర్తన,అనుచిత స్పర్శ వంటి విషయాలపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని సూచించారు. గుడ్ టచ్--బ్యాడ్ టచ్ గురించి వివరించి, తమకు అసౌకర్యం కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తించినప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే పోక్సో చట్టం ద్వారా బాలబాలికలకు కల్పిస్తున్న రక్షణ, బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడితే తీసుకునే చట్టపరమైన చర్యల గురించి వివరించారు. విద్యార్థులు తమపై జరిగే వేధింపులను దాచిపెట్టకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు ఫోన్ చేయవచ్చని, అవసరమైన సహాయం కోసం 8712671000 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలియజేశారు. సైబర్ నేరాల పట్ల కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు,ఫోటోలు, పాస్‌వర్డ్‌లు పంచుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్వతాలు ఉపాధ్యాయులు,సంబంధిత అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో బాలల భద్రత, చట్టపరమైన హక్కులు ఆత్మరక్షణపై అవగాహన పెంపొందించేందుకు కృషి చేశారు.

## మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో షాకింగ్ ఘటన

**ఒంటిపై పెట్రోల్ పోసుకుని**
**నిప్పంటించుకుని స్టేషన్‌లోకి పరుగెత్తిన బాధితుడు**
**కాపాడబోయి గాయపడ్డ ఇద్దరు పోలీసులు**

**వాస్తవం : వరంగల్ జిల్లా ప్రతినిధి**

వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సంచలన ఘటన చోటు చేసుకుంది. కట్ల హర్షిత్ అనే వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని మంటలతోనే నేరుగా పోలీస్ స్టేషన్‌లోకి పరుగెత్తాడు. దీంతో స్టేషన్‌లో ఒక్కసారిగా కలకలం రేగింది. భార్యాభర్తల వివాదమే కారణమా? గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్న నేపథ్యంలోనే హర్షిత్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం. పోలీసులకు గాయాలు మంటల్లో ఉన్న హర్షిత్ ను కాపాడే ప్రయత్నంలో స్టేషన్ రైటర్ ప్రవీణ్, హెడ్ కానిస్టేబుల్ ముగ్ధమ్ లకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రుల ముగ్గురినీ వెంటనే వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# డీజే వద్దు...బాజా ముద్దు

**గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో**

**డీజే సౌండ్ సిస్టమ్‌కు అనుమతి లేదు**

**గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి**



**వాస్తవం : గోదావరిఖని**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు గోదావరి ఖని పోలీసుల ఆధ్వర్యంలో ఈరోజు గోదావరిఖని పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజే ఆపరేటర్లు యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి ఖని ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ, గణేష్ నవ రాత్రి ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు మండప నిర్వాహకులు భక్తులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఉత్సవాల్లో సాధారణ సౌండ్ సిస్టమ్‌ను మాత్రమే వినియోగించాలని మైక్ సిస్టమ్‌ను రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించి డీజే సౌండ్ సిస్టమ్‌ను వినియోగించినట్లయితే, సంబంధిత డీజే ఆపరేటర్లు యజమానులు మండప నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనకు అవకాశం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీజే ఆపరేటర్లు యజమానులను ఈరోజు బైండోవర్ చేసినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని అదే సమయంలో పోలీస్ శాఖ సూచించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి కోరారు. "డీజేకు దూరంగా ఉండి బాజాతో భక్తి భావాన్ని చాటుకుందాం. ప్రశాంత వాతావరణంలో గణేష్ నవ రాత్రి ఉత్సవాలను నిర్వహించి గణనాథుని ఆశీర్వాదం పొందుదాం" అని ఇన్స్పెక్టర్ ఆకాంక్షించారు.

# బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు



**వాస్తవం : భూపాలపల్లి**

బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో ముందస్తు వినాయక చవితి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహభరితంగా నిర్వహించారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించి, విద్యార్థులు సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వినాయకుడి ప్రతిమలను ఏర్పాటు చేసి, పుష్పాలు, పత్రాలతో అలంకరించారు. గణపతి పూజ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, విద్యార్థులందరూ భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. విద్యార్థులు వినాయక చవితి పండుగ విశిష్టత, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యత పై అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఏ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించడం, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నివారించడం, సహజ రంగులు మరియు పూలతో పూజా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రిన్సిపాల్ రజినీకాంత్ మాట్లాడుతూ, పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు, ఐక్యత, భక్తి, పర్యావరణ బాధ్యత వంటి విలువలను పెంపొందిస్తాయి అని తెలిపారు. వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మట్టి వినాయక విగ్రహాలు తయారుచేసి పంపిణీ

**వాస్తవం : సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ నగర్ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మట్టి వినాయకుల ప్రాధాన్యతను, తయారీ విధానాన్ని వివరించి మట్టి వినాయకుల విగ్రహాలను తయారు చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసాల హరిప్రసాద్ ప్లాస్టర్ ప్యారిస్ యొక్క నష్టాలను వివరించి, వినాయక చవితి పండుగ విశేషాలను వివరించారు. పర్యావరణ పరిరక్షణను కాపాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లావణ్య, జోషి, రవి, ప్రసన్న, కరుణా, రూప, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం**



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించి జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం సిరిసిల్ల మండల స్థాయిలో మండల విద్యాధికారి దూస రఘుపతి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి హాజరై మండలంలోని 16 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శాలువా, మెమెంటో, సర్టిఫికెట్లతో సత్కరించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని, ఉపాధ్యాయులు భావిభారత పౌరుల నిర్మాతలని ఈ సందర్భంగా పలువురు వక్తలు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లకావత్ మోతిలాల్, లోకిని శారద, బైరి రవీందర్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



# అంగన్వాడీలో పోషణ మాస కార్యక్రమం



**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ శంకరమ్మ ఆధ్వర్యంలో.. శుక్రవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. పోషక ఆహార ప్రాముఖ్యతపై గర్భిణీలకు, బాలింతలకు అవగాహన కల్పించారు. బాలామృతంతో పలు రకాల వంటలు చేసి చూపించారు. అంగన్వాడీ సేవలను ఉపయోగించుకోవాలని, మూడు నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలను అంగన్వాడి స్కూల్‌కి పంపించాలని, ఈ వయసులో పిల్లల శారీరక మానసిక అభివృద్ధి మేదోశక్తి పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాందాల శారద అబ్రహం, అంగన్వాడి ఉపాధ్యాయురాలు తూము అనిత, ద్యావనపల్లి జ్యోతి, సంటి సంధ్య, మ్యాకల సుజాత, వార్డు సభ్యులు పత్తిపాక లావణ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, గర్భిణీలు బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## భూముల నిషేధిత జాబితా

# 22ఏను వెంటనే రద్దు చేయాలి

**జనసేన సిద్దిపేట జిల్లా నాయకులు దోనే అశోక్**

**వాస్తవం : బెజ్జంకి**




తెలంగాణ రాష్ట్రంలో నిషేధిత జాబితాలో చేర్చిన 22ఏను ప్రభుత్వం తక్షణమే తొలగించి రైతులను ఆదుకోవాలని జనసేన సిద్దిపేట జిల్లా అధ్యక్షులు దోనే అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాసన సభా సమయాన్ని వృథా చేయకుండా ప్రజా సమస్యలపై ప్రజా ప్రతినిధులు చర్చించాలని కోరారు. ల్యాండ్ రిజిస్ట్రేషన్ల చట్టంలోని 'సెక్షన్ 22ఏ' ద్వారా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు, రైతులకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ప్రజల ప్రయోజనాలను పక్కన పెట్టి, వారి భూములను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ప్రజలు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జరిగిన సీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మునుపటి గత ప్రభుత్వ హాయంలో ధరణి' పోర్టల్‌తో పోల్చుకుంటూ, తాము తక్కువ భూములనే నిషేధిత జాబితాలో చేర్చామని సమర్థించుకోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం కంటే తాము తక్కువ మోసం చేశామని చెప్పుకోవడం అంటే, వర్తమాన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలను మోసం చేస్తున్నట్లే కదా అని ప్రశ్నించారు. పాలనలో మార్పు వస్తుందని నమ్మి ఓటేసిన ప్రజలను ఈ ప్రభుత్వం నిరాశపరిచిందన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటుందన్నారు. నిరుద్యోగులకు సరైన జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడంతో నిరుద్యోగుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు, రాష్ట్ర అభివృద్ధిపై బాధ్యతా యుతమైన చర్చలు జరగాల్సిన అసెంబ్లీలో, నాయకులు ఒకరిపై ఒకరు పరుష పదజాలంతో విమర్శలు చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వాన్ని నిలదీసే నెపంతో సభా దిగ్బంధనానికి పూనుకోవడం, సభా సంప్రదాయాలను మరియు రాజ్యాంగ వ్యవస్థలను అవమానించడం సరైంది కాదని హితవు పలికారు. స్పీకర్ నిర్ణయాలను, పోలీస్ శాఖ విధులను రాజకీయం చేస్తూ సభ అమూల్యమైన సమయాన్ని వృథా చేయవద్దని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు మల్యాల శేషు కుమార్ మరియు మాజోజి కనకయ్య ఉన్నారు.

# రాజన్న ఆలయానికి లాకర్ వితరణ



**వాస్తవం : వేములవాడ (ఆర్ సి ఇంచార్జ్ )**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వేములవాడ శాఖ సిబ్బంది సుమారు రూ. 45,000 విలువైన లాకర్‌ను విరాళంగా అందజేశారు. శుక్రవారం ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో ఆలయ ఈవో రమాదేవి కి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వేములవాడ శాఖ ప్రతినిధులు, సిబ్బంది లాకర్‌ను లాంఛనంగా అప్పగించారు. ఆలయ అవసరాల నిమిత్తం లాకర్‌ను బహూకరించిన వేములవాడ గ్రామీణ బ్యాంక్ అధికారులకు, ఉద్యోగులకు ఈవో ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పీ ఆర్వో పెరిక శ్రీనివాస్, అకౌంట్ అడ్వైజర్ ఆగమరావు బ్యాంక్ వేములవాడ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రెడ్డి జాతి పైన అనుచితమైన వ్యాఖ్యలు

**తీన్మార్ మల్లన్నపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు**



**వాస్తవం : మోత్కూర్**

మోత్కూర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రెడ్డి జాతి పైన అసభ్యకరంగా అనుచితమైన వ్యాఖ్యలు చేసిన కారణంగా చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మోత్కూర్ రెడ్డి సంఘం అధ్యక్షుడు లింగాల జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కులాల మధ్య జాతుల మధ్య వైశమ్యాలు సృష్టించి రాజకీయంగా ఎదగాలనుకోవడం మూర్ఖత్వం అని తీన్మార్ మల్లన్నకు రాజకీయంగా గానీ, వ్యక్తిగతంగా కానీ ఏదైనా ఉంటే దాన్ని ఆ వ్యక్తులతో చూసుకోవాలి కాని మొత్తం రెడ్డి జాతినే అవమానించేలా మాట్లాడితే మాత్రం ఊరుకునేది లేదని తీన్మార్ మల్లన్నకు తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పైళ్ల. సోమిరెడ్డి, ముప్ప. వెంకటరెడ్డి, బద్దం. రామ నర్సింహారెడ్డి, ఫుల్సాని. వెంకటరెడ్డి , అమనగంటి. వెంకటరెడ్డి, గంటా. వేమల్ రెడ్డి, కృష్ణారెడ్డి,సోలిపురం. చంద్రారెడ్డి, కొప్పుల. శ్రీనివాస్ రెడ్డి, సామ. నర్సిరెడ్డి, బిల్లా. సోమిరెడ్డి,బద్దం. మల్లారెడ్డి, ముప్ప. మల్లారెడ్డి ముప్ప. తిరుమలరెడ్డి, కొంతం. మహేందర్ రెడ్డి, కొప్పుల. రవీందర్ రెడ్డి, సామల. ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమీక్షా సమావేశం

**వాస్తవం: రాజేంద్రనగర్**



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శుల సమీక్షా సమావేశం జరిగింది. శుక్రవారం జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరయ్యారు. జిల్లా అధ్యక్షునిగా ఎంపికైన చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని డివిజన్లకు నూతనంగా ఎంపికైన అధ్యక్ష, కార్యదర్శులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. అనంతరం అధికారికంగా నియామక పత్రాలను అందజేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని అధ్యక్ష, కార్యదర్శులకు ఎమ్మెల్యే సూచించారు. స్థానిక సమస్యల పరిష్కారం దిశగా సమన్వయంతో పని చేయాలని పలు కీలక సలహాలు అందించారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎంపికైన పార్టీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

**డీఈ కార్యాలయం ఎదుట మహ్మదాపూర్ గ్రామస్థుల ధర్నా**

**వాస్తవం : హుస్నాబాద్**

హుస్నాబాద్ డీఈ కార్యాలయం ఎదుట మహ్మదాపూర్ గ్రామస్థులు శుక్రవారం ధర్నా చేపట్టారు. గ్రామంలో మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు విద్యుత్ స్తంభాలు పాతినప్పటికీ ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు విషయంలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ముఖ్యంగా లైన్ ఇన్‌స్పెక్టర్ తమ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు మార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు.ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే గ్రామంలోని విద్యుత్ సరఫరా సమస్యలు కొంతమేర పరిష్కారమవుతాయని, రైతులు, గృహ వినియోగదారులకు ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు.స్తంభాలు పాతి,అవసరమైన ఏర్పాట్లు చేసిన తర్వాత కూడా ట్రాన్స్‌ఫార్మర్ బిగించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆలస్యం చేయకుండా వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించే వరకు అధికారులను సంప్రదిస్తామని గ్రామస్థులు తెలిపారు.



# లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవండి

**జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ రెడ్డి**

**వాస్తవం : హుస్నాబాద్**

ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని, ఇంటర్మీడియట్ దశ విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమని, ప్రణాళికాబద్ధంగా చదివితే విజయాలు సాధించవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే.రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు ఫ్రెషర్స్ డే సందర్భంగా స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ వి. లలిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రవీందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ కళాశాలల విద్యార్థినులు కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని, మొబైల్ ఫోన్లను విద్యాభివృద్ధికి మాత్రమే వినియోగించాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలోనూ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ వి. లలిత మాట్లాడుతూ... విద్యార్థినులు క్రమశిక్షణతో చదివి పోటీ పరీక్షల్లో రాణించాలని, ఏఐ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.గత విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ఈ సందర్భంగా అభినందించి నగదు పారితోషికాలు అందజేశారు. హెచ్‌ఈసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని తూర్పాటి వైష్ణవి 978 మార్కులు, ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విద్యార్థిని కటోజ్ వసుమిత్ర 442 మార్కులు, బైపీసీ విద్యార్థిని మగుటం సంగీత 432 మార్కులు సాధించారు. వీరికి ప్రిన్సిపల్ వి. లలిత, హిస్టరీ అధ్యాపకుడు ఏ.సంపత్ నగదు పారితోషికాలు అందజేశారు.అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జానపద గీతాలకు చేసిన నృత్యాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ బాలికల, బాలుర హెచ్‌ఎం లు జి. మహేందర్, వాసుదేవరెడ్డి, అధ్యాపకులు డి.రవీందర్,ఎస్. సదానందం,టి. నిర్మలాదేవి,బి.లక్ష్మయ్య, డి. కర్ణాకర్, ఏ. సంపత్, ఎస్.కవిత,కే.స్వరూప,జి.కవిత, ఆస్మా పిర్దోస్, ఓ. రాణి, అధ్యాపకేతర సిబ్బంది కే. గీతాంజలి, ఎస్. రాములు, టి. రమాదేవి, విద్యార్థినులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.






# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా స్వాగతోత్సవం




**ఉత్తమ అవార్డు గ్రహీత ప్రిన్సిపల్‌కి సన్మానం**

**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం స్వాగతోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు పొందిన కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయలక్ష్మిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి అధ్యక్షత కళాశాల నూతన విద్యార్థులకు స్వాగతోత్సవం కార్యక్రమం నిర్వహించగా అతిథులుగా చందుర్తి తహశీల్దార్ భూపతి, ఎంపీడీవో రాధా, జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ లు, చందుర్తి సర్పంచ్ పులి సత్యం గౌడ్ హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ఈ సందర్భాన్ని తహశీల్దార్ భూపతి మాట్లాడుతూ...కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మీ సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు అందించడం అభినందనీయమని అన్నారు .విద్యార్థులు అందరు కూడా కష్టపడి చదివి చక్కటి ప్రణాళికతో ముందుకు సాగి చందుర్తి కళాశాల పేరును ఉన్నత శిఖరాలకు చేర్చాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లు దేవరాజం, రఘునందన్, రాజయ్య, పద్మావతి, భార్గవి దేవి,కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# షేక్ పెట్ ఎం.ఆర్.వో.కి వినతిపత్రం

**లంకాల దీపక్ రెడ్డితో బిజెపి నేతలు**



**వాస్తవం : జూబ్లీహిల్స్**

సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ కేంద్ర హోం మంత్రిగా ఉన్న సమయంలో హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్ లో విలీనం చేయడానికి తెలంగాణా విమోచన దినోత్సవం ని ఆపరేషన్ పోలో పేరుతో సైనిక చర్య చేపట్టారు. సెప్టెంబర్ 13(1948)న ప్రారంభమైన ఈ చర్య కేవలం ఐదు రోజుల్లోనే ముగిసింది. సైనిక చర్య దాటికి తట్టుకోలేక నిజాం నవాబు లొంగిపోయారు.సెప్టెంబర్ 17 (1948) హైదరాబాద్ సంస్థానం అధికారికంగా భారతదేశంలో విలీనమైనట్లు నిజాం రేడియో ద్వారా ప్రకటించారు.వివరాల్లోకి వెళ్తే తెలంగాణ విమోచన దినోత్సవం( సెప్టెంబర్ 17)ను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా చేయాలని షేక్‌పేట్ ఏం. ఆర్.వో. కి శుక్రవారం బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి అధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో డి. ప్రేమ్ కుమార్ , బంగారు ప్రశాంత్, డాక్టర్ పద్మా వీరపనేని, శ్రీనివాస్ రెడ్డి , భరత్ గౌడ్ , భోజ్ రెడ్డి , తో పాటు అన్ని డివిజన్ల వివిధ హోదాల నాయకులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్ళు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటి ఆవరణలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి**



**వాస్తవం : హుస్నాబాద్ :**

పట్టణంలో నివసించే పౌరులు తప్పకుండా మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 9 మరియు 19 వ వార్డ్ లలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ... ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనం పెంపొందించడంతో పాటు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయవచ్చని సూచించారు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై మొక్కలను నాటి వాటిని బాధ్యతగా సంరక్షించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్ , కౌన్సిలర్ లు సంపత్ ,మంజుల , బత్తుల స్వరూప, మున్సిపల్ అధికారులు, మెప్మా ఆర్ పి లు, వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.



# కోమటిచేనులో ఘనంగా బడగ పండుగ

**వాస్తవం : కాసిపేట**

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కోమటిచేను గ్రామ వాసులు పోలాల పండుగను ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకుంటారు. మూడు రోజులు పాటు జరిగే ఈ పొలాల పండగలో గురువారం రోజున పితృతర పనం చేయగా రెండవ రోజైన శుక్రవారం బడగ పండగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరూ ప్రొద్దున ఐదున్నర ప్రాంతంలోనే నిద్రలేచి తమ ఇంటి చుట్టూ మరియు ఇంటి పరిసరాలలో ఒక కర్రతో కొడుతూ "జెంజేర్ల మారబోథ్ " "హడాపిడా దొరున్గేయిన్ జైగో మార్ బోథ్ " మాస్ మూర్కుటా ధోరున్ గేయిన్ జైగో మారబోథ్ " అనే నినాదాలు చేస్తారు. దీని అర్థం ఏమిటంటే ఇంటి లోపల ఏమైనా చీడా పీడా ఈగలు దోమలు రోగాలు ఏమైనా ఉంటే బయటికి వెళ్లిపోవాలని దాని అర్థం. ఆ విధంగా ఇంటి లోపల ఉన్నటువంటి రోగాలను దోమలను తరి మిన ఆ కొట్టిన ఆ కట్టెలను ఊరి బయట ఉన్నటువంటి ఒక మోతుకు చెట్టు దగ్గర కు వెళ్లి చెట్టు చుట్టూ ఐదు ప్రదక్షిణాలు చేసి,తమ ఇంటిలో ఉన్నటువంటి దుష్ప్ర భావాలను వెళ్లగొట్టాలని ఆ చెట్టుకి మొక్కి, ఆ కట్టెలను ఆ చెట్టుకి ఆనిస్తారు. తదనంతరం ఆ చెట్టు చుట్టుప్రక్క లో ఉన్నటువంటి వివిధ రకాల మొక్కలను ఔషధాలుగా భావించి తమ ఇంటికి తెచ్చుకొని ఇంటి గుమ్మానికి కట్టి తమ ఇంటి లోపలికి ఎటువంటి దుష్ట శక్తిని రోగాలను రానివ్వకుండా కాపాడుతుంది అని నమ్ముతారు. దాని తర్వాత మట్టితో చేసినటువంటి కాముని దంపతుల బొమ్మలను రోకలి మీద పెట్టి పాటలతో ఊరేగిస్తూ ప్రతి ఇంటి నుంచి నైవేద్యాన్ని అడుగుతారు తగనంతరం ఆ కాముని దంపతుల బొమ్మలను దగ్గరలో ఉన్నటువంటి వాగులోకి తీసుకెళ్లి నిమజ్జనం చేసి ఊరందరూ ఇచ్చినటువంటి నైవేద్యాన్ని కలిసికట్టుగా అందరూ ఆరగించి తమ ఊరి సఖ్యతను చాటి చెబుతారు ఈ విధంగా కోమటి చేను గ్రామములో పొలాల పండగలో భాగమైన రెండవ రోజు బడగను ఘనంగా జరుపుకు న్నారు. ఈ సందర్భంగా నేతకాని, మహార్ కులస్తులైన టువంటి జాడి.రాజేష్ దుర్గం. కృష్ణ తదితరులు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్నటువంటి ఈ పండగను మన తరం గొప్పగా జరుపుకొని మన తర్వాతి తరానికి కూడా ఈ పండగ యొక్క ప్రాముఖ్యతని తెలియజేయాలన్నారు. ఈ పండగలో భాగంగా కోమటి చేను గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





## నాసిరకం పనులతో
# కాంట్రాక్టర్లకు లబ్ది



**వాస్తవం : రాజేంద్రనగర్**

అధికారుల పర్యవేక్షణ లోపంతో జరుగుతున్న నాసిరకం పనులతో కేవలం కాంట్రాక్టర్లకే లబ్ధి చేకూరుతుందని ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని మణికొండ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మణికొండ శ్రీ లక్ష్మీ నగర్ ప్రాంతంలో టీం ఫోర్ సంస్థ బహుళ అంతస్తుల నిర్మాణంలో భాగంగా డ్రైనేజీ వ్యవస్థ కోసం ఇష్టానుసారంగా రోడ్ల తవ్వకాలు జరిగాయన్నారు. అధికారుల పర్యవేక్షణలో ఇప్పటికీ నాలుగైదు పర్యాయాలు ధ్వంసమైన రోడ్డును వేసారని తెలిపారు. వేసిన కొన్ని రోజులకే గుంతలమయంగా రహదారులు మారడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి, అధికారుల పర్యవేక్షణా లోపానికి గుంతలు నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అందే లక్ష్మణరావు, సంఘం శ్రీకాంత్, సుమనలిని పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

**కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి**

**వాస్తవం : అడ్డగూడూరు :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అడ్డగూడూరు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..... శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కించపరిచేలా బీఆర్ఎస్ నేతలు మాట్లాడడం క్షమించరాని నేరం అని పేర్కొన్నారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ గురువారం అడ్డగూడూరు మండలంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరై రాష్ట్ర ముఖ్యమంత్రిని, దళిత స్పీకర్ ను తన స్థాయికి మించి మరిచి ఇష్టానుసారంగా మాట్లాడితే కాంగ్రెస్ నాయకులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఒక దళితుడివై ఉండి ఒక దళిత స్పీకర్ ను అవమానపరిస్తే దానిని ఖండించకుండా ఏదో అను పార్లమెంటరీ వాక్యం చేసిండని సమర్థిస్తున్నావంటే దళిత సమాజానికే సిగ్గుచేటు అన్నారు. గతంలో పది సంవత్సరాలు తుంగతుర్తి లో ఎమ్మెల్యేగా ఉండి మా దిగ సమాజం మీద దాడి చేసిన చరిత్ర నీది అన్నారు. నియోజకవర్గంలో ఉన్న సహజవనరులను, ఇసుకను దోసుకెళ్లి వేల కోట్లు సంపాదించావు అన్నారు. ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టి మాట్లాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు నిమ్మనగోటి జోజి, పట్టణ శాఖ అధ్యక్షులు పూలపల్లి సోమిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయ కులు పాశం సత్యనారాయణ, బాలెంల విద్యాసాగర్, సర్పంచులు రాచకొండ రమేష్, ముక్కామల శ్రీకాంత్ యాదవ్, పోలిశెట్టి బాలశౌరి, నాయకులు బొమ్మగాని లక్ష్మయ్య, ననుబోతు సమ్మయ్య, పరశురాములు, పూల పెల్లి రాజశేఖర్ రెడ్డి, మేకల పవన్, మందుల సోమన్న, మందుల వెంకటేష్, కోక ఉమేష్, కడారి నాగరాజు, పనికేరా సూర్య కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## జామే మసీదు నిర్మాణానికి
# నిధులు మంజూరు చేయాలి

**మంత్రి అజారుద్దీన్‌ను కలిసిన జామే మసీదు కమిటీ సభ్యులు**



**వాస్తవం : వేములవాడ**

వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ వీధిలో శిథిలావస్థకు చేరుకున్న జామే మసీదు నూతన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ జామే మసీదు కమిటీ సభ్యులు రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ను హైదరాబాద్‌లో శుక్రవారం కలిసి వినతి చేశారు.మసీదు ప్రస్తుత పరిస్థితిని వివరించారు. మసీదు భవనం శిథిలావస్థలో ఉండటంతో ముస్లిం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వ విప్ , వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో స్వయంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లి నూతన మసీదు నిర్మాణానికి తప్పనిసరిగా నిధులు మంజూరు చేయాలని మరోసారి కోరారు.మసీదు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని కమిటీ సభ్యులు కూడా మంత్రిని కోరారు. దీనిపై మంత్రి అజారుద్దీన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయ కులు అబ్దుల్ రజాక్, జామే మసీదు కమిటీ అధ్యక్షులు మహమ్మద్ నవాబ్ ఖాన్, క్యాషియర్ సయ్యద్ షబ్బీర్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సోహెల్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# బీఎల్ఓ ప్రేమలతను సన్మానించిన గ్రామపంచాయతీ పాలకవర్గం



**వాస్తవం : వలిగొండ :**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని మండలంలోని మొగిలిపాక గ్రామంలో వంద శాతం పూర్తి చేసిన సందర్భంగా బీఎల్ఓ ప్రేమలతను గ్రామ పంచాయతీ పాలకవర్గం ఘనంగా సన్మానించింది. ఈ సందర్బంగా శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్‌రెడ్డి, సర్పంచ్ జడిగె బుచ్చయ్య యాదవ్‌తో పాటు గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు బీఎల్ఓ ప్రేమల తకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ సైదులు, వార్డు సభ్యులు గంట భాస్కర్, మచ్చ అండాలు, పబ్బు వెంకటేష్, పబ్బు శిరీష బాలకృష్ణ, మచ్చ సునీత, స్వామి పంచాయతీ కార్యదర్శి పావని, మాజీ పాల సంఘం చైర్మన్ పబ్బు సత్తయ్య, నాయకులు జక్క శ్రీనురెడ్డి, మచ్చ నవీన్, బీమనబోయిన మచ్చేందర్, మొగిలిపాక దుర్గాప్రసాద్, చలిచీమల కృష్ణ, శ్యామల నరేష్, మొగిలిపాక షామంత్, సింగం శంకరయ్య, పబ్బు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ విగ్రహాల ఏర్పాటుకు
# పోలీసు శాఖ అనుమతి అనివార్యం

**మండపాల పూర్తి బాధ్యత నిర్వాహకులదే**

**సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి**

**హుస్నాబాద్ ఏసిపి సదానందం**

**వాస్తవం : హుస్నాబాద్ :**





గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడానికి ఆయా ప్రాంతాల్లో ఉండే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలని, నిమజ్జనం పూర్తయ్యేంత వరకు పూర్తి బాధ్యత నిర్వాహకులే తీసుకోవాలని హుస్నాబాద్ ఏసిపి సదానందం అన్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో వినాయక చవితి మండపాల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఐ శ్రీధర్, ఎస్ఐ లక్ష్మారెడ్డి పాల్గొన్న ఈ సమావేశంలో హుస్నాబాద్ ఏసిపి సదానందం మాట్లాడారు. గణపతిని ప్రతిష్టించుకునే ఆర్గనైజర్లు కమిటీ మెంబర్లు పోలీసు శాఖ వారిచే అనుమతి తీసుకోవాలని, నిర్వాహకులు తమ యొక్క వివరాలను పొందుపరిచి అప్లికేషన్‌ను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందించాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించకుండా రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉన్న ప్రదేశాలలో మాత్రమే వినాయకులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వినాయక ప్రతిష్ట నుండి నిమజ్జనం పూర్తయ్యేంత వరకూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఆర్గనైజర్లు వినాయక మహోత్సవం సందర్భంగా ఏ సమస్య ఉన్నా వాట్స్అప్ లో మెసేజ్ చేస్తే వెంటనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అన్ని మతాల వారు కలసి పండుగ జరుపుకోవడం సిద్దిపేట పట్టణంలో గొప్ప ఆచారమని తెలిపారు. పోలీసు వారి సలహాలు, సూచనలు పాటించి ప్రశాంతమైన వాతావర ణంలో ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. ఎలక్ట్రిసిటి డిపార్ట్మెంట్ వారి పర్మిషన్ తీసుకుని కరెంటు వాడాలని, వినాయకుని మండపం రోడ్డు ప్రక్కన గాని ఖాళీ స్థలంలో గాని నిర్మించాలి. విగ్రహం యొక్క స్టేజి కింద ఎలాంటి వస్తువులు ఉంచరాదు.మండపాల వద్ద తగినంత సంఖ్య లో స్థానిక సత్ప్రవర్తన కలిగిన వాలంటీర్లను నియమించి భక్తులను క్రమబద్ధీకరించే విధంగా చూడాలని సూచిం చారు. గణేష్ మండపాలను మంచి నాణ్యత కలిగిన వస్తువులతో ఏర్పాటు చేయాలని మండపం మూడు వైపులా టార్పాలిన్ తో కప్పాలని మండపాలకు నాణ్యత కలిగిన వైరుతో కరెంట్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. వివాదా స్పద ప్రదేశాలలో మండపాలు ఉండకూడదని,ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం కలిగించరాదన్నారు. మండపాలలో అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండ మండపాల వద్ద టపాకాయలను ఇతర మందుగుండు సామాగ్రిని ఉంచరాదు. మండపం దగ్గర పూజా సమయాలలో భక్తుల వాహనాలను సరైన పద్ధతిలో పార్కింగ్ చేయామహ్మదీయ ప్రార్థన నమాజ్ సమయంలో లౌడ్ స్పీకర్లు వాడరాదు. విగ్రహాల దగ్గర బాక్స్ టైప్ స్పీకర్లను మాత్రమే వాడాలి ముందుగా పర్మి షన్ తీసుకోవాలి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉదయం గం 6:00 నుండి రాత్రి గం.10:00 వరకు స్పీకర్లను మాత్రమే వాడాలి, స్పీకర్ సౌండ్ మోతాదులోనే ఉండాలి. ఇతరులకు ఇబ్బంది. కలుగకుండా చూడాలి. భక్తికి సంబంధించిన పాటలు మాత్రమే వేయాలి. లౌడ్ స్పీకర్లు విద్యాలయాలకు, ఆసుపత్రులకు, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలకు ప్రార్థన మందిరాలకు, ఇబ్బంది కలిగే విధంగా ఉండరాదు. గణేష్ మండపము ఇనుప రేకులతో ఉండాలి చుట్టూ బ్యారికేటింగ్ కట్టాలి. మండపాల వద్ద వాటర్ డ్రమ్ము మరియు ఇసుక తప్ప కుండా ఉంచ వలెను.మద్యం సేవించకూడదు. మద్యం సేవించి మండ పాల వైపు రాకూడదు. మహిళల పట్ల మర్యాద పూర్వ కంగా మెలగాలన్నారు.మండపాల వద్ద కొత్త వ్యక్తులు సంచరించినచో మరియు ఎలాంటి సమాచారమైన పోలీసు వారికి డయల్ 100 ద్వారా విధిగా తెలియపర చాలి. సోషల్ మీడియాలో వచ్చే అనవసర వదంతులను, పుకార్లు నమ్మరాదన్నారు.ఈ సమావేశంలో మండలం లోని ఆయా గ్రామాల సర్పంచులు, ఉత్సవ కమిటీ ఆర్గనైజర్లు, కన్వీనర్లు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**మేడిపల్లి : వాస్తవం :** శుక్రవారం మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్ పది పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీ ఫేస్ టూలో దోమల నివారణపై మున్సిపల్ అధికారి నరేష్ అవగాహన సదస్సును నిర్వహించారు.




నీటిని నిలువ ఉంచడం వలన దోమ లు విపరీతంగా పెరుగుతాయి కాబట్టి ప్రజలందరూ నీటిని ఇళ్లలో నిల్వ ఉంచకుండా చూసుకోవాలని, దోమల వలన మలేరియా, టైఫాయిడ్, డెంగు వంటి వ్యాధులు ప్రబల కుండా ఉండాలంటే దోమలను అరికట్టాలున్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకునేలా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కా ర్యక్రమంలో దేవేందర్ నగర్ కాలనీ ఫేస్ టూ అధ్యక్షులు చిన్నం గణేష్, కర్రె బీరప్ప, ఎస్కే అబ్దుల్లా, నరసింహ, అనిల్, రాజు, కాలనీవాసులు మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కుష్టు నివారణకు సమష్టిగా కృషి చేయాలి

**రాష్ట్ర వైద్య బృందం**

**వాస్తవం : మనోహరాబాద్ :**



కుష్టు వ్యాధి నివారణ,నియంత్రణ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ బృందం సూచించింది. ఈ మేరకు రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ బృందం సభ్యులు శుక్రవారం మనోహరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడి వైద్య సేవలు,కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్, డాక్టర్ వెంకటేశ్వర్ చారి,శ్రీనివాస్, డీఎంఎంఓ సంతోష్ కుమార్ తదితరులు ఆరోగ్య కేంద్రంలోని సిబ్బందితో సమావేశమై కుష్టు వ్యాధి నివారణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించాల్సిన అవసరాన్ని వారు వివరించారు. అలాగే కుష్టు వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వ్యాధి లక్షణాలు,చికిత్స విధానం,నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కుష్టు వ్యాధి నిర్ధారణ అయిన వారికి నిరంతర చికిత్స అందిస్తూ,వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని బృందం సూచించింది. వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని రాష్ట్ర బృందం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వర్గీయ శ్రీపాద రావుకు నివాళి

**బేగంపేట యూత్ కాంగ్రెస్ నాయకులు**



**వాస్తవం : రామగిరి**

ఇటీవల నూతనంగా ఎన్నికైన బేగంపేట యూత్ కాంగ్రెస్ కార్యవర్గం శుక్రవారం రామయ్యపల్లి వద్ద ఉన్న స్వర్గీయ శ్రీపాద రావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించింది. బేగంపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కందుకూరి శ్యామ్, ఉపాధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సేగ్గం రాజేష్, రామగిరి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవినాష్ గౌడ్, సీనియర్ నాయకుడు పరవేన లింగయ్య, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఇందారపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సేవ విభూషణ్ అవార్డు అందుకున్న ఎర్ర యాదగిరి



**వాస్తవం : తిరుమలగిరి**

తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామానికి చెందిన ఎర్ర యాదగిరి గ్రామీణ ప్రాంతంలో బాల్యవివాహాలు, బాలల హక్కులు, పల్లె కవులు కళాకారుల సమస్యలపై, మలిదశ ఉద్యమంలో సామాజిక ఉద్యమ కళాకారుడిగా పనిచేసినందుకు గాను జిసివిస్ వల్లూరి ఫౌండేషన్, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రాం, డాక్టర్ బాబు మోహన్, మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల్ చారి చేతుల మీదుగా హైదరాబాదులోని రవీంద్రభారతిలో సేవ విభూషణ్ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ శ్రీనివాసరాజు, బ్రహ్మకు మారి, ఆంజనేయులు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం

**వాస్తవం : బెజ్జంకి**





బెజ్జంకి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో (బాలుర ) స్కూల్ అసిస్టెంట్ మాధవి లత, లక్ష్మీపూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సాబుద్దీన్ (ఎస్ జి టి ) లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టిటిసి భవన్ లో జిల్లా స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ హైమావతి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బెజ్జంకి మండలంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మాధవి లత, షాబుద్దీన్‌లకు మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## గీకురు రవీందర్ మరణం

# బీసీ సమాజానికి తీరని లోటు

**ఎంపీ ఈటల రాజేందర్**

**వాస్తవం : చిగురుమామిడి:**



గీకురు రవీందర్ మరణం బీసీ సమాజానికి తీరనిలోటని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించిన చిగురుమామిడి మాజీ జెడ్పిటిసి,బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్ కుటుంబాన్ని, బంధువులను శుక్రవారం ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు. చిగురుమామిడిలోని గీకురు రవీందర్ నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ కరీంనగర్,చిగురుమామిడి ప్రాంతాల్లోని బీసీ కులాల ప్రజలు రాజకీయ ఆర్థిక రంగాలతో పాటు అన్ని రంగాల్లో వచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ ఎదగడానికి బీసీలలో చైతన్యాన్ని గీకురు రవీందర్ తీసుకువచ్చారన్నారు. నిత్యం మహనీయుల ఆశయాల కోసం పోరాటం చేశారని,మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా రవీందర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్,చొప్పదండి మాజీ ఎంఎల్ఏ బొడిగె శోభ,బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి,జమ్మికుంట మాజీ జడ్పీటీసీ,కాటారం



సింగిల్ విండో చైర్మన్ చల్లా నారాయణ రెడ్డి,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బందిని దూషిస్తే చర్యలు తీసుకుంటాం

**హాస్పిటల్ సూపర్డెంట్ సౌజన్య**

**వాస్తవం : అందోల్**



హాస్పిటల్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తే సహించేది లేదని జోగిపేట ఏరియా ఆసుపత్రి సుపరిండెంట్ డాక్టర్ సౌజన్య హెచ్చరించారు. ఇటీవల కాలంలో పలువురు వ్యక్తులు హాస్పిటల్‌కి వచ్చి సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించారని,మద్యం సేవించి సిబ్బందిపై దుర్భాషలాడుతున్నారని దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఇలా అయితే ఎలా ట్రీట్మెంట్ ఇస్తామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఇలా జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు.



# కరెంటు కోతలపై రైతుల రాస్తారోకో

## ఎండిన పంటల కర్రలతో రహదారిపై ధర్నా

**వాస్తవం : చిగురుమామిడి:**

కరెంటు కోతలను నిరసిస్తూ చిగురుమామిడి మండల రైతులు శుక్రవారం కరీంనగర్-హుస్నాబాద్ ప్రధాన రహదారిలో సుందరగిరి గ్రామ అంబేద్కర్ చౌరస్తాలో నిరసన ధర్నా చేపట్టారు.మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఎండిన మొక్కజొన్న పత్తి వరి పంట కర్రలతో రహదారిపై నిరసనగా రాస్తారోకో నిర్వహించారు. చేతికొచ్చిన పంట చివరి దశలో విద్యుత్ కోతల వలన సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు 24 గంటల కరెంటు అందిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చి గెలిచాక రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుందని విద్యుత్ కోతలతో తమకు ఇబ్బందులు కలిగిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ కోతలతో పాటు ఎరువుల కొరత ఏర్ప డేలా చేస్తుందని పంట కొనుగోలు విషయంలో కూ డా వివిధ రకాల ఇబ్బందులకు గురి చేస్తుందని రైతులు ఆగ్ర హించారు.ప్రభుత్వం వెంటనే రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.ఇక విద్యుత్ శాఖ అధికారులను కరెంటు కోతలపై వివరణ ఇవ్వ వలసిందిగా రైతులు కోరితే స్పందించడం లేదన్నారు. విద్యుత్



శాఖ అధికారులు ప్రభుత్వం కుమ్మక్కై రైతులకు నష్టం జరిగేలా చేస్తున్నారని అన్నారు.వ్యవసాయ పొలాల వద్ద ప్రతిరోజు కనీసం ఒక గంట సమయం కూడా కరెంటు ఇవ్వడం లేదన్నారు.వర్షాలు లేక సాగునీరు అందక చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. విషయం తెలుసుకుని పోలీస్ సిబ్బందితో నిరసన ధర్నా వద్దకు చేరుకున్న చిగురుమామిడి ఎస్ఐ జగదీశ్వర్ రైతులతో మాట్లాడగా విద్యుత్ శాఖ అధికారులు కరెంటు కోతలపై తమకు స్పష్టత ఇచ్చేవరకు కదిలేదిలేదని వారించగా దీంతో పోలీసులు రైతులకు మధ్య కాస్త వాగ్వాదం చోటుచేసుకుంది.దీంతో గంటన్నర పాటు కరీంనగర్ హుస్నాబాద్ హుజురాబాద్ రహదారిపై భారీగా వాహనా లు నిలిచిపోయి వాహనదారులు ప్రయాణికులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.పోలీసులు రైతులను అక్కడి నుండి తరలించారు.



# గణపతి నిమజ్జనానికి ఏర్పాట్లు

## నాలుగు చెరువులను పరిశీలించిన సీపీ, కలెక్టర్లు



**వాస్తవం : వరంగల్ జిల్లా ప్రతినిధి**

గణపతి విగ్రహాల నిమజ్జనానికిపకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం నగరంలోని కాజీపేట బంధం చెరువు,హనుమకొండ సిద్దేశ్వర గుండం, చిన్న వడ్డేపల్లి, ఉర్సు చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను వారు సంయుక్తంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ, నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖలఅధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. క్రేన్లను అందుబాటులో ఉంచాలని, బంధం చెరువులో గుర్రపుడెక్క తొలగింపు వేగవంతం చేయాలని, చెరువుల్లో నీటిమట్టం తక్కువగా ఉన్నందున పెద్ద విగ్రహాల నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.సీపీ, కలెక్టర్లు స్థానిక అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ప్రతిష్టించే విగ్రహాల ఎత్తుపై ప్రత్యేక దృష్టి సారించాలనీ,మట్టి విగ్రహాల నిమజ్జనం సులువనీ,తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను స్థానికంగానే నిమజ్జనానికి సహకరించాలనీ, నవరాత్రులు పూర్తి కాగానే వీలైనంత త్వరగా నిమజ్జనానికి తీసుకురావాలని,ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ రవికుమార్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# డీఈఓ ఆదేశాలు బేఖాతర్!

**నోటీసులు ఎన్నిసార్లు ఇచ్చినా..**

**నిబంధనలు మాత్రం శూన్యం**


**గుర్తింపు లేకుండా పాఠశాల నిర్వహణ**

**శ్రీ చైతన్యపై విద్యాశాఖ కొరడా ఎప్పుడు?**

**పర్మిషన్ లేని తరగతులు నిర్వహిస్తే చర్యలు : డీఈఓ**

**వాస్తవం : బాన్సువాడ:**

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహణపై విద్యాశాఖ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. బాన్సువాడలోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రభుత్వ అనుమతి లేని తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో విద్యాశాఖ అధికారులు గతంలో పలుమార్లు ఎంఈఓ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోవడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి."నోటీసులు ఇచ్చినా పట్టించుకోకపోతే.. తదుపరి చర్యలు ఏంటి?" అనే చర్చ తల్లిదండ్రులు, విద్యార్థుల వర్గాల్లో మొదలైంది. పాఠశాల నిర్వహణకు సంబంధిత తరగతులకు ప్రభుత్వ అనుమతి, గుర్తింపు తప్పనిసరిగా ఉండాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.గుర్తింపు లేకుండా పాఠశాలలను నిర్వహించే యాజమాన్యాలపై ఎప్పటికైనా శాఖాపరమైన చర్యలు తప్పవని డీఈఓ హెచ్చరించినట్లు తెలుస్తోంది. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత యాజమాన్యంపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అధికా రులు స్పష్టం చేస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్‌ను దృష్టి లో ఉంచుకుని పాఠశాలలో చేర్పించే ముందు ఆ పాఠశాలకు ప్రభుత్వ అనుమతి ఉందా? ఏ తరగతుల వరకు గుర్తింపు ఉంది? అనే వివరాలను తల్లిదండ్రులు తప్పనిసరిగా పరిశీలించాలని విద్యాశాఖ సూచిస్తోంది. అనుమతి ఉన్న పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని అధికారులు కోరుతున్నారు.





**గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తప్పవు**

ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా పాఠశాల నిర్వ హిస్తే ఉపేక్షించేది లేదని ఐజూ స్పష్టం చేశారు. పలు మార్లు ఎంఈవో నోటీసులు జారీ చేసినా పట్టించుకోని యాజమాన్యంపై శాఖాపరమైన చర్యలు తప్పవని డీఈవో హెచ్చరించారు.తల్లి దండ్రులు అనుమతులు ఉన్న పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని సూచించారు.

## మోత్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

# పద్య పఠన పోటీలు




**వాస్తవం :మోత్కూర్**

ఏకాగ్రత ధారణాశక్తిని పెంపొందించే పద్య పఠనాన్ని ప్రతి విద్యార్థి సాధన చేయాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరవిందరాయుడు అన్నారు. శుక్రవారం పాఠశాల విద్యార్థులకు పద్యపఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకి ప్రత్యేకమైన పద్యాన్ని చదవడం వల్ల భాషా పరిజ్ఞానంతో పాటు ఏకాగ్రత ధారణాశక్తి వికాసం చెందుతుందని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విశ్రాంత లెక్చరర్ వడ్డేపల్లి. లక్ష్మీనరసయ్య సౌజన్యంతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజయ్య ,రాంప్రసాద్, శ్రీనివాస్ ,లలిత కుమారి, వెంకటయ్య, సుధీర్ కుమార్, వెంకటాచారి, ప్రవీణ్ , రవి ,లింగయ్య, రవికుమార్ ,కవిత, జయశ్రీ ,స్వప్న, ఉప్పలయ్య ,వెంకటేశ్వర్లు, అశోక్ , వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# దళితుల పట్ల బీఆర్ఎస్, బీజేపీలది అంటరాని వైఖరి

## టీపీసీసీ అధికార ప్రతినిధి మానవతరాయ్ ఫైర్

**వాస్తవం : వరంగల్ జిల్లా ప్రతినిధి**

దళితుల పట్ల బీఆర్ఎస్, బీజేపీలు హీనమైన అంటరాని వైఖరిని అవలంబిస్తున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి డా" కోటూరి మానవతారాయ్ ధ్వజమెత్తారు.వరంగల్, హన్మకొండ జిల్లాల ఇంఛార్జ్‌గా నియమితులైన అనంతరం హన్మకొండ డీసీసీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను బీజేపీ నేతలు శుద్ధి చేయడం దళిత నాయకుడికి ఘోర అవమానం. బీజేపీది వికసిత్ భారత్ కాదు, వివక్ష భారత్ అని అన్నారు.రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న దళిత స్పీకర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు బూతులు తిట్టడం క్షమించరాని నేరమాని, దళిత స్పీకర్‌ను అవమానించి నందుకు ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో కెసిఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితులు డప్పు కొట్టి నిరసన తెలిపితే, వారు నడిచిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేయడం అనాగరిక చర్యనీ,అంటరానితనాన్ని ప్రోత్సహించే క్షుద్ర రాజకీయాలు చేస్తున్నారని కెసిఆర్ మొదటి నుండి దళిత ద్రోయని అన్నారు. దళిత




ముఖ్యమంత్రని, మూడెకరాల భూమనీ, మోసం చేశారనీ, మాదిగ జాతికి చెందిన డా. రాజయ్యను కారణం లేకుండా డిప్యూటీ సీఎం పదవి నుంచి తొలగించారన్నారు. అసెంబ్లీకి రాకుండా ఎగ్గొట్టే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ దొంగలని,నిన్న అసెంబ్లి వద్ద బట్టలు విప్పి, మహిళా అధికారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ తలసరి ఆదాయంలో రూ.4,19,931తో దేశంలోనే రెండో స్థానంలో ఉందని ప్రపంచ బ్యాంక్, నీతి ఆయోగ్, ఆర్బీఐ ధృవీకరించాయని, దీన్ని జీర్ణించుకోలేకే విపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. అనంతరం హనుమకొండ జిల్లా డిసిసి అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్, బీజేపీలు దళితులను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయని, వారి నయవంచనను ప్రతి గ్రామంలో, ప్రతి గడపకు తీసుకెళ్తామన్నారు. మానవతారాయ్ రాకతో ఉమ్మడి వరంగల్‌లో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు.ఈ సమావేశంలో వరంగల్ డీసీసీ అధ్యక్షులు ఎండీ అయ్యూబ్, పెరుమాండ్ల రామకృష్ణ, బందెల భద్రయ్య, ఆరూరి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## తక్షణం పిఆర్‌సిని ప్రకటించి

# అమలు చేయాలి

**టిఆర్ టిఎఫ్ జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్**



**వాస్తవం : సిరిసిల్ల**

ఉద్యోగ, ఉపాధ్యాయుల పిఆర్‌సిని తక్షణ ప్రకటించి అమలు చేయాలని టిఆర్ టిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ కోరారు.జిల్లాలోని తంగళ్ళపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం టిఆర్ టిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ మాట్లాడు తూ ఉద్యోగ,ఉపాధ్యాయులకు రావాల్సిన పిఆర్‌సిని వెంటనే ప్రకటించి దసరా లోపు అమలు చేయాలన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న 6 డి ఎ లను మంజూరు చేయాలన్నారు.ఉద్యోగ శాపంగా ఉన్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధా నాన్ని పునరుద్ధరించాలన్నారు. 30 నుండి 35 సంవత్సరాల పాటు ఉద్యోగిగా సేవ చేసిన రిటైర్డైన పెన్షనర్ల బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలపై ప్రభావం చూపుతున్న జివో 25ను సవరించాలని, జివో 317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.ప్రభుత్వం ఇప్పటికై నా కాలయాపన చేయకుండా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ సాను కూలంగా స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టిఆర్ టిఎఫ్ తంగళ్ళపల్లి మండల అధ్యక్షుడు బూట్ల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కాసాని అనిల్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మామిడాల రమేష్, కొర్ర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కమీషన్లు నాకెందుకు?

**(మొదటి పేజీతరువాయి)**

ఆ స్కూళ్లలో 64 వేల మంది ఇంగ్లీషు విద్యను అభ్యసిస్తున్నారన్నారు."విద్య ఒక్కటే జీవితాల్లో మార్పు, వెలుగు తీసుకొస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం 2024లో 'సీపెక్' సర్వే చేసింది. వివిధ కులాలు, ఉప కులాల ఆర్థిక, విద్య, సామాజిక, వెనుకబాటుకు సంబంధించి దీనిని చేశాం. ఇందులో ఓ కొత్త అంశం మా దృష్టికి వచ్చింది. సామాజిక వెనుకబాటుకు ఆస్తులు, అంతస్తులు కారణం కాదు. ఆస్తులున్న వారు సామాజిక వెనుకబాటుకు లోనయ్యారు. ఒక్క గుంట భూమి, ఎకరం వ్యవసాయ భూమి, సొంత ఇల్లు లేనివారు సామాజికంగా అగ్ర భాగాన ఉన్నట్లు తేలింది. దీనికి విద్య కారణమని తెలిసింది. దళితులు, ఆదివాసీల నుంచి వచ్చినవారు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఐఏఎస్ లుగా రాణించి సామాజికంగా ఎంతో ఎత్తుకు ఎదిగారు. ఇలాంటి వాళ్లకు సొం తంగా ఆస్తులేమీ లేవు. చదువుకోవడం వల్ల సామాజికంగా గౌరవం పొందుతున్నారు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.అలాగే, గ్రామీణ ప్రాంతాల్లో కురుమ సోదరులకు ఎకరాలకొద్దీ భూమి, వందలకొద్దీ గొర్రెలు, మేకలు, ఇంట్లో బంగారం అన్నీ ఉంటాయని, కానీ, పిల్లలను పెద్దగా చదివించకపోవడం వల్ల సామాజికంగా సమాజంతో కనెక్షన్ తెగిపోయిందని, వారు సామాజికంగా వెనుకబడినట్లు సర్వేలో తేలిందని వివరించారు. అందుకే, "చదువు ఒక్కటే మన తలరాతను మారుస్తుంది. దేశంలో క్లోజ్డ్ ఎకానమీ ఉన్నప్పుడు, సరళీకృత ఆర్థిక విధానాలు అమల్లో లేనప్పుడు మన చదువు, మన ఉద్యోగం... ఊరు, సమితి, నియోజకవర్గం, జిల్లా, జోనల్ వ్యవస్థను దాటలేదు. కానీ, ఇప్పుడు ఓపెన్ ఎకానమీ! లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలను పీవీ నర్సింహా రావు ప్రవేశపెట్టిన తర్వాత ప్రపంచ విద్యా విధానం అంతా మనకు అందుబాటులోకి వచ్చింది.ఈరోజు మనం ప్రపంచంతో పోటీ పడాల్సిన పరిస్థితి. అన్ని వ్యవస్థలు మారిపోయాయి. అందుకే, తెలంగాణ విద్యా విధానంలోని లోటుపాట్లను సవరించడానికి మొట్టమొదటిసారి విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. ఆ కమిషన్ నివేదిక ఇచ్చింది. ఇందులో కొన్ని అభ్యంతరాలుంటే... కె.కేశవరావు ఆధ్వర్యంలో మరో కమిటీని వేశాం. ప్రొఫెసర్ కోదండరామ్, శాంతా సిన్హాలను సభ్యులుగా నియమించాం. తెలంగాణలో మంచి విద్యా విధానాన్ని అమలు చేసుకోవడానికి మేధావులు, నిపుణులు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలి" అని కోరారు.

# అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం

**వాస్తవం : మోత్కూర్**

పోషణ మాసంలో భాగంగా మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో మూడవ అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్ చైర్మన్ పల్లెర్ల .వెంకన్న గుప్తా , ఆశ వర్కర్ ఏఎన్ఎం ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు జీరో నుండి ఆరు సంవత్సరాల పిల్లలు తీసుకోవాల్సిన ఆహారం జింక్ ఫుడ్ వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమానికి వైస్ చైర్మన్ పల్లెర్ల. వెంకన్న ఏఎన్ఎం సైదమ్మ, రేణుక , అంగన్వాడీ టీచర్ దాసరి. యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

